26. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 290 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర కూతురి వివాహం

### హాజరై ఆశీర్వదించిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి

**గుంటూరు,మార్చి 25 :**

గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల

2 లో..



### దేశంలో పెట్రోల్, డీజిల్

# కొరత లేదు

- ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు
- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరోమారు ప్రకటన




**న్యూఢిల్లీ,మార్చి 25 వెలుతురు:**

పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల

2 లో..

### 99 రోజుల ప్రణాళికలో "2బిహెచ్‌కె"

# కేటాయింపులు పూర్తి చేస్తాం

- త్వరలో 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు
- జూన్ నాటికి మరో లక్ష పూర్తి
- పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లకు కార్యాచరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 25:**

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయడమేగాక, ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం నాడు సుమారు 22 మంది శాసనసభ్యులు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల తదితరల అంశాలపై అడిగిన

2 లో..

### సోషల్ మీడియా

# వదంతులను నమ్మకండి

- పెట్రోలు, డీజిల్ కొరత లేనేలేదు
- ఆయిల్ సంస్థల వద్ద అవసరానికి సరిపడ పెట్రోలు, డీజిల్ నిల్వలున్నాయని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది
- ఆయిల్ సరఫరాలోనూ ఇబ్బందుల్లేవు
- పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది
- మోదీ ప్రభుత్వం ఆయిల్ నిల్వలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది
- వదంతులు నమ్మి అవసరానికి మించి పెట్రోలు కొనడంవల్ల కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం
- రాష్ట్ర ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ విజప్తి



2 లో..

### మీరేమైనా రాజులా...

# ఎందుకీ నిర్లక్ష్యం

- చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా
- క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా
- కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు
- చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం
- మీరెందు వారి ఇంటికి వెళ్లలేక పోయారు
- వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ,మార్చి25( వెలుతురు):**

నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య

2 లో..



## సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

- విద్యుత్ బకాయిలు మాఫీ చేయండి
- డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ వినతి

**హైదరాబాద్,మార్చి25 వెలుతురు:**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్



### అపోహలు, వదంతులు

# నమ్మవద్దు

- రాష్ట్రంలో పెట్రో, గ్యాస్ కొరత లేదు
- పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి
- సోలార్ పవర్ పై డిప్యూటీ సీఎం భట్టి

2 లో..




## అమ్రాబాద్ గిరిజనులకు పూర్తి అండ

- వారికి ప్రత్యామ్నాయ కాలనీ నిర్మాణం
- ఒక్కో కుటుంబానికి 15 లక్షల పరిహారం
- నగదు అందచేసిన డిప్యూటి సిఎం భట్టి

2 లో..

### పాలకుల వివక్ష కు వ్యతిరేకంగా

# కదంతొక్కిన కలం కార్మికులు

- జర్నలిస్టుల ర్యాలీ, ధర్నాతో దద్దరిల్లిన సమాచార భవన్
- విజయవంతంగా ఛలో హైదరాబాద్
- వివక్ష విడనాడకపోతే రాష్ట్రవ్యాపిత ఆందోళన
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య



**వెలుతురు హైదరాబాద్, మార్చి 25:**

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా అనేక మంది జర్నలిస్టులు బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐఅఃడ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో



హైదరాబాద్"కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను

2 లో..

### కాంగ్రెస్ పార్టీకి

# జీవన్ రెడ్డి గుడ్‌బై

- నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల
- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి




**జగిత్యాల,మార్చి25 వెలుతురు:**

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్దంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు.

3 లో..

## సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారంపై తుమ్మలకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రిని కలిసి ఒక లేఖను అందజేశారు. సిరిసిల్ల పట్టణం రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయ వంటిదని, గతంలో ఇక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన చేదు జ్ఞాపకాలను కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వివరించారు. 2016 నుంచి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని, అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి నేతన్నను అదుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికుల ఉపాధిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరుతూ కింద పేర్కొన్న అంశాలపై విజ్ఞప్తి చేశారు:? సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌చార్జి మొత్తాలను పూర్తిగా మాఫీ చేయాలి. పాత బకాయిలతో సంబంధం లేకుండా, పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా ఆదేశాలుఇవ్వాలి.కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టకుండా తక్షణ ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. సిరిసిల్ల నేతన్నల సమస్య కేవలం ఒక ప్రాంతానిది కాదని, అది వేలాది కుటుంబాల మనుగడకు సంబంధించినదని కేటీఆర్ గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.కెటిఅర్ గారితోపాటు ఏంఎల్సీ ఎల్ రమణ గారు కూడా ఉన్నారు

## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర కూతిరి వివాహం

ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్రాబాద్ గిరిజనులకు పూర్తి అండ

**హైదరాబాద్,మార్చి25 వెలుతురు :**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## మీరేమైనా రాజులా...ఎందుకీ నిర్లక్ష్యం

భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్ట్‌లు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

## దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్లెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి. మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది ప్రభుత్వం. వీటి అమలును పర్యవేక్షించడం సహా సమ్మతిని నిర్ధారించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్ నోడల్ అథారిటీకి బాధ్యతలు అప్పగించింది.

# 99 రోజల ప్రణాళికలో "2బిహెచ్‌కె" కేటాయింపులు పూర్తి చేస్తాం

ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా త్వరలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు గాను కొద్ది రోజుల్లో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెస్తామని వీటి ద్వారా వచ్చే ప్రశ్నలకు 24 గంటల్లోగా సమాధానం చెప్పడమేగాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మూడు విభాగాలుగా సమస్యలను విభజించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 21లక్షల ఇండ్లు నిర్మించారని తెలిపారు. మళ్లీ ఈ పేదల ప్రభుత్వంలోనే పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సాగుతోందని అన్నారు. గత ప్రభుత్వం రెండు లక్షల పైచిలుకు ఇండ్లను మంజూరు చేసి హైదరాబాద్ ప్రాంతానికి లక్ష ఇండ్లను కేటాయించగా వీటిలో 78,861 ఇండ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని, 21, 838 ఇండ్లు కేవలం పునాదులకే పరిమితమయ్యాయని తెలిపారు. జిహెచ్‌ఎంసీ పరిధిలో 26 కాలనీలు అసంపూర్తిగా ఉండిపోయాయని, తాము కొత్తగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేశామని వివరిస్తూ 738 కోట్ల రూపాయిలతో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. తాము ఎటువంటి భేషజాలకు పోకుండా గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 92వేల ఇళ్లలో 62వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు. 2023 ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం 23,500 ఇండ్లను కేటాయించిందని అయితే నగరంలో వృత్తి వ్యాపారాలు చేసుకునే వారు సమారు 20-30 కిలోమీటర్ల దూరంలో కేటాయించిన ఇండ్లలోకి రాలేదని ఫలితంగా 12వేలకు పైగా ఇండ్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మూడు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు. లబ్దిదారులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు నెలల్లోగా వీటిలో గృహప్రవేశాలు చేయాలని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఒకవేళ వారు రాలేక పోతే సుమారు 5-10 కిలోమీటర్ల పరిధిలో ఉండే అర్హులైన పేదలకు కేటాయించేందుకు నిర్ణయించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొత్త కేటాయింపులు పూర్తి చేస్తామని సభకు తెలిపారు. 2017లో చేపట్టిన కాలనీలకు మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో రూపొందించిన ఎస్టిమేషన్లు రద్దుచేస్తూ జీవో ఇచ్చామని, అదేవిధంగా జర్నలిస్టుల కాలనీలకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 80 కాలనీలకు మౌలిక సదుపాయాల కోసం 784 కోట్లు మంజూరు చేశామని, వీటిలో సుమారు 432 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని ,మిగిలిన మొత్తంతో పాటు మరో 270 కోట్ల రూపాయిల వరకు అవసరం ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో తొలివిడత 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ ప్రత్యేకంగా చెంచులకు, ఐటిడిఎ పరిధిలో గిరిజనులకు 12వేల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వివిధ కాలనీల్లో షాపులకు సంబంధించి లీజుకు ఇస్తే వారు సక్రమంగా అద్దెలు చెల్లించడం లేదని, పైగా కోర్టులకు వెళ్తున్నందున అద్దెలు వసూలు కావడం లేదని ఈ పరిస్థితుల్లో సదరు షాపులను బహిరంగ వేలంలో విక్రయించి వచ్చిన డబ్బును ఆయా కాలనీ కమిటీ, ప్రభుత్వం పేరిట జమచేసి వాటిపై వచ్చే వడ్డీతో విద్యుత్, లిఫ్ట్ తదితర అవసరాలుకు ఖర్చు చేసేలా ప్రతిపాదించామని తెలిపారు. గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, ఇంతవరకు కేటాయించని ఇండ్లకు సంబంధించి పాత కాంట్రాక్టర్లు అప్పటి రేటుకు సమ్మతిస్తే వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు. ఈ 99 రోజులు ప్రణాళికా కార్యక్రమంలో లబ్దిదారుల ఎంపిక పూర్తిచేస్తామని , గతంలో నిర్మాణాలు చేపట్టి ఆపివేసిన లబ్దిదారులకు మిగిలిన నిర్మాణాలకు గాను నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షునిగా ఉంటారని, ఆయన ఆధ్వర్యంలోని కమిటీ నిరుపేదలను ఎంపిక చేస్తే కలెక్టర్ పరిశీలన, అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో కేటాయింపులు జరుగుతాయని, రానున్న కాలంలో ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించేలా పరిశీలిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఈ మార్చి 31నాటికి సుమారు లక్షా 12వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు జరుగనున్నాయని, వచ్చే జూన్ నాటికి మరో లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి పొంగులేటి ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా ఆగిపోయిన ఇండ్లకు నిధులు ఇస్తామని దీనిపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలిపారు. జిహచ్‌ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి గాను ఇప్పటికే 14-15 స్థలాలను గుర్తించామని , ఆయా ప్రాంతాలలోని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని , రాష్ట్రంలోని ఇతర ముఖ్యపట్టణాలలో కూడా ఇదే పద్ధతిని అమలు చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# సోషల్ మీడియా వదంతులను నమ్మకండి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 25:**

రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న వదంతులు నమ్మవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయనే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆయిల్ నిల్వలపై పర్యవేక్షిస్తోందని తెలిపారు. క్రుత్రిమ కొరత స్రుష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ముఖ్యంగా వాహనదారులు రోజువారీ అవసరాలకు తగ్గట్లుగానే క్రమశిక్షణతో పెట్రోలు, డీజిల్ ను కొనుగోలు చేయాలని విజప్తి చేశారు.ఈ మేరకు బుధవారం ఉదయం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరాలోను లోపం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోషియేషన్ కూడా స్పష్టం చేసింది" అని తెలిపారు. "పెట్రోల్ మరియు డీజిల్ కొరత ఉందనే పుకార్లను, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి చాలా మంది పెట్రోలు బంకుల వద్దకు పరుగులు తీస్తూ ట్యాంకులు నింపుకుంటూ, అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కసారిగా డిమాండ్ పెరగడంవల్ల కొన్ని పెట్రోలు బంకుల్లో తాత్కాలిక స్టాక్ కొరత ఏర్పడుతోంది. దానివల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడే అవకాశాలున్నాయి. ఇదే అదనుగా కొంతమంది క్రుత్రిమ కొరత స్రుష్టించి బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మ వద్దని ప్రజలకు విజప్తి చేస్తున్నా"అని పేర్కొన్నారు. "ముఖ్యంగా పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆయిల్ నిల్వలపై పర్యవేక్షిస్తోంది. క్రుత్రిమ కొరత స్రుష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా వాహనదారులు రోజువారీ అవసరాలకు తగ్గట్లుగానే క్రమశిక్షణతో పెట్రోలు, డీజిల్ ను కొనుగోలు చేయాలని విజప్తి చేస్తున్నా. తద్వారా పెట్రోల్ బంకుల్లో క్రుత్రిమ కొరత ఇబ్బందుల్లేకుండా యథావిధిగానే సరఫరా కొనసాగుతుంది"అని తెలిపారు.

# పాలకుల వివక్ష కు వ్యతిరేకంగా కదంతొక్కిన కలం కార్మికులు

విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడు జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో- కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్,కృష్ణమాచారి, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కే. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి, కో- కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, సంతోష్, బ్రహ్మం,మహిళా నాయకులు సాజిదా, శివపార్వతి, సుస్మిత, మంజులత రెడ్డి,తీగవరపు శాంతి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు.

## అపోహలు, వదంతులు నమ్మవద్దు

**హైదరాబాద్,మార్చి25 వెలుతురు:**


హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంక్‌లకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, సుధీర్ బాబు, ఆయిల్ కంపెనీల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం పరిశీలన చేస్తుందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో గృహ ఉపయోగ, వ్యవసాయ రంగానికి సంబంధించి 81 గ్రామాల్లో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను చేపడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో భాగంగా 38,216 గ్రామాలు మరియు 16,078 వ్యవసాయ పంప్ సెట్ లకు సోలార్ ఎ÷-లాంట్స్ ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. గృహ ఉపయోగ రూఫ్ టాప్ సోలార్ కింద పీఎం సూర్యగర్ ప్రభుత్వ బిజిలీ కింద 40, 349 గృహాల్లో టు కే సామర్థ్యం రూట్ ఆఫ్ సోలార్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు వ్యవసాయ సేవలు కింద పీఎం కుసుమ్ కాంపోనెంట్ సి కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా 16,708 వ్యవసాయ సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# రష్యా నుంచి భారీగా క్రూడాయిల్ కొనుగోళ్లు

### - 60 మిలియన్ బ్యారెళ్లు సేకరించినట్లు ప్రచారం

**న్యూఢిల్లీ,మార్చి25( వెలుతురు):**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురుకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర భారీగా పెరిగింది. దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తోంది.




తాజాగా రష్యా నుంచి 60 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు 'బ్లూమ్‌బర్గ్' తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లోని బ్రెంట్ క్రూడాయిల్ ధర కంటే, బ్యారెల్‌కు 5-15 డాలర్లు అధికంగా చెల్లించి మరీ భారత రిఫైనరీలు ఈ కొనుగోళ్లు జరిపినట్టు సమాచారం. ఫిబ్రవరిలో రష్యా నుంచి కొనుగోలు చేసిన ముడి చమురుతో పోల్చుకుంటే ఈ కొనుగోళ్లు దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసి ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో.. రష్యా క్రూడాయిల్‌పై అమెరికా ఆంక్షలు సడలించింది. దీంతోనే భారత్ గ్గి÷నైరీలు ఇంత భారీ స్థాయిలో కొనుగోళ్లు జరిపాయి. హోర్ముజ్ జలసంధి దగ్గర నౌకల ప్రయాణానికి అంతరాయం కొనసాగినంత కాలం రష్యా ముడి చమురుపై ఆంక్షల సడలింపును అమెరికా పొడిగించే అవకాశం కనిపిస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న ఇరాన్ చమురుపై కూడా ఆమెరికా ఆంక్షలు ఎత్తేసింది. ఆ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు వార్తలు వచ్చాయి.



# సీఎం గారూ....ఎందుకీ 'వివక్ష' వ్యాఖ్యలు?

- మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయిస్తే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటి?
- అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల సంఖ్య పెంపుతో 'దక్షిణాది'కి జరిగే నష్టమేంది?
- తెలంగాణలో 50 శాతం సీట్లను పెంచొద్దని చెబుతున్నారా?
- ఇంకెన్నాళ్లు ప్రాంతీయ అసమానతల పేరు చెప్పి చలి కాచుకుంటారు?
- దేశాన్ని విభజించాలని చూస్తున్నారా?
- దేశభక్తి, జాతీయ వాదం మీలో మచ్చుకైనా కన్పించవా?
- దక్షిణాదిలోని తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే వణుకు మీలో... మొదలైందా?
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ పాచిక తమిళనాడు, కేరళలో పారడం లేదని అర్థమైందా?
- అందుకే దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని కొత్త డ్రామా మొదలు పెట్టారా?
- తమిళనాడు, కేరళ ప్రజలు విజులు.... కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధమయ్యారు
- పార్లమెంట్, అసెంబ్లీలలో 33 శాతం మంది మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తే తప్పేంటి?
- మీకు, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషం
- అందుకే 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వలేదు
- మహిళా రిజర్వేషన్ల ద్వేషులతో జత కట్టారు
- మహిళా రిజర్వేషన్ల బిల్లు కాపీలను చింపిన ఆర్జేడీ, సమాజ్ వాదీ పార్టీలతో అంటకాగుతున్నారు
- మీరెన్ని కుట్రలు చేసినా, విభజన రాజకీయాలు చేసినా మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు మార్చి 25:

# లోక్‌సభ అసెంబ్లీ స్థానాల పెంపు మహిళలకు విస్తృత అవకాశాలు, మహిళలకు కొత్త అవకాశం సాధికారతకు బలమైన పునాది

**- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మార్చి 25:



దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన మార్పుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ స్థానాలను సుమారు 50 శాతం పెంచాలనే నిర్ణయం కేవలం సంఖ్యల పెంపుగా కాకుండా, ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తరించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా చూడాలి. ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ స్థానాలను 816కు పెంచే ప్రతిపాదనతో పాటు, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను గణనీయంగా విస్తరించే యోచన దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయంగా భావించవచ్చు.

**ప్రతినిధిత్వంలో సమతుల్యత అవసరం**

స్వాతంత్ర్యం తర్వాత దేశ జనాభా గణనీయంగా పెరిగినా, ప్రజాప్రతినిధుల సంఖ్య దాదాపు స్థిరంగానే ఉండటం వల్ల ప్రజల సమస్యలు సమగ్రంగా ప్రతిబింబించడంలో లోపాలు కనిపించాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్థానాల పెంపు ద్వారా నియోజకవర్గాల పరిమాణం తగ్గి, ప్రజలకు ప్రతినిధులు మరింత చేరువ అవుతారు. సమస్యల పరిష్కారం వేగవంతమయ్యే అవకాశముంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే చర్యగా చెప్పవచ్చు.

**తెలుగు రాష్ట్రాలకు అవకాశాల విస్తరణ**

ఈ నిర్ణయం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కూడా గణనీయమైన లాభం చేకూరే అవకాశం ఉంది. తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు, అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కు పెరిగే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కు, అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు పెరిగే అవకాశం ఉంది. ఈ మార్పులు ప్రాంతీయ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి దోహదపడతాయి.

**2029 నుంచి అమలు దిశగా కసరత్తు**

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసి, 2029 ఎన్నికల నుంచే అమలు చేయాలని కేంద్రం ప్రయత్నాలు ప్రారంభించడం గమనార్హం. దీని ద్వారా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

**మహిళలకు కీలక అవకాశం**

స్థానాల పెంపు మహిళలకు రాజకీయాల్లో ముందుకు రావడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయానికి ముందుగానే నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం, గ్రామస్థాయిలో మహిళలను సమన్వయం చేయడం, రాజకీయ అవగాహన పెంపొందించడం అత్యవసరం. మహిళలు ఒకరికొకరు అండగా నిలుస్తూ ముందుకు వస్తే, ఈ అవకాశం నిజమైన సాధికారతగా మారుతుంది.

**సాధికారత దిశగా ముందడుగు**

స్థానాల పెంపు నిర్ణయం మహిళా నాయకత్వానికి బలమైన పునాది వేస్తుంది. రాబోయే రోజుల్లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంది. ఈ నిర్ణయం ద్వారా సమానత్వం బలోపేతం అవుతుంది. కొత్త నాయకత్వం ఎదుగుతుంది. ప్రజాస్వామ్యం మరింత విస్తృతమవుతుంది. ప్రజల ప్రతినిధిత్వాన్ని విస్తరించే ఈ నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి మహిళా లోకం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. స్థానాల పెంపు అనేది కేవలం రాజకీయ నిర్ణయం కాదు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఒక వ్యవస్థాత్మక మార్పు. ఈ నిర్ణయం పారదర్శకంగా అమలు అయితే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

"ప్రతినిధిత్వం పెరిగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది."

# సంస్కారం లేని స్వేచ్ఛ : నేటి తరం పిల్లలు ఎటు వెళ్తున్నారు?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా ఆస్తులు ఇవ్వడం సులభమే, కానీ విలువలను అందించడంలో మనం విఫలమవుతున్నామా? ఆధునికత ముసుగులో క్రమశిక్షణను వదిలేసి, పిల్లల ఉజ్వల భవిష్యత్తును మనమే చేతులారా చిదిమేస్తున్నామా? ఇది ఒక ఇంటి సమస్య కాదు. ఒక సామాజిక సంక్షోభం! విశాఖపట్నానికి చెందిన ఒక మధ్యతరగతి తల్లి ఆవేదన ఇది నా కొడుక్కి పదిహేనేళ్లు. అడిగిందల్లా కొనిచ్చాం. స్వేచ్ఛ ఇచ్చాం. కానీ ఇప్పుడు వాడు మా మాట వినడం లేదు. రాత్రంతా ఫోన్ పట్టుకుని కూర్చుంటున్నాడు, అడిగితే ఎదురు సమాధానం చెప్తున్నాడు. చదువు అటకెక్కింది. అసలు వాడి మనసులో ఏముందో, వాడు ఏ లోకంలో ఉంటున్నాడో మాకు అర్థం కావడం లేదు. ఈ మాటలు ఈ రోజు తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది ఇళ్లలో వినిపిస్తున్న ఆర్తనాదాలు. మనం పిల్లలకు ఖరీదైన గ్యాడ్జెట్లు ఇచ్చాం, కార్పొరేట్ స్కూళ్లలో సీట్లు ఇప్పించాం, అడగకముందే అరచేతిలోకి ప్రపంచాన్ని తెచ్చిపెట్టాం. కానీ, జీవితాన్ని ఎలా గడపాలో నేర్పే సంస్కారాన్ని ఇవ్వడం మర్చిపోయామా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజాన్ని బలంగా వేధిస్తోంది.*

గత రెండు దశాబ్దాల్లో భారతీయ కుటుంబ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాల నుండి వెస్టిండీస్ తరహా చిన్న కుటుంబాలకు (చీబఎశ్రీఝతీ ఛీఖఎఅశ్రీఐవం) మారిపోయాం. ఒకప్పుడు తాతయ్యలు, అమ్మమ్మల నీడలో కథల రూపంలో అందే నైతిక విలువలు, ఇప్పుడు గూగుల్ సెర్చ్‌లలో వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. అంతకుముందు తరాల వారు పెద్దల అనుభవం నుండి నేర్చుకున్న విధానం చాలా స్పష్టంగా ఉండేది. క్రమశిక్షణ, గౌరవం, నిజాయితీ, సేవ ఈ నాలుగు స్తంభాల మీద పిల్లల వ్యక్తిత్వం రూపుదిద్దుకునేది. అయితే నేటి తరం తల్లిదండ్రులు అమెరికా, యూరోపియన్ నమూనాలను గుడ్డిగా అనుసరిస్తూ పిల్లలకు పర్సనల్ స్పేస్ (వ్యక్తిగత స్వేచ్ఛ) ఇవ్వడమే గొప్ప ప్రేమగా భావిస్తున్నారు. స్వేచ్ఛ ఇవ్వడం తప్పు కాదు, కానీ ఆ స్వేచ్ఛకు బాధ్యత అనే కంచె లేకపోతే అది విచ్చలవిడితనంగా మారుతుంది. స్వేచ్ఛ అనేది ఒక అందమైన పువ్వు లాంటిది. దానికి సంస్కారం అనే నేల లేకుంటే, అది వేరు పట్టి వికసించలేదు సగర్వంగా నిలబడలేదు. నేడు తరగతి గదుల్లో వాతావరణం మునుపటిలా లేదు. పిల్లలు చిన్న వయసులోనే నో చెప్పే అలవాటు పెంచుకుంటున్నారు. ఇది ఆత్మవిశ్వాసం అనుకుంటే పొరపాటే. ఉపాధ్యాయులతో అనవసరంగా వాదించడం, హోంవర్క్ చేయకపోవడాన్ని ఒక హక్కుగా భావించడం, తోటి విద్యార్థుల పట్ల అమానవీయంగా ప్రవర్తించడం వంటివి పెరిగిపోతున్నాయి.

విశాఖపట్నంలోని ఒక ప్రముఖ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మీప్రభ గారు తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. నేటి పిల్లలు అద్భుతమైన సృజనాత్మకత కలిగిన వారు. కానీ వారిలో ఉండాల్సిన ప్రాథమిక వినయం కరువవుతోంది. ఇంట్లో ఏ నియమాలూ లేకపోవడం వల్ల, పాఠశాల నిబంధనలను వారు భారంగా భావిస్తున్నారు. మొదటి తరగతి నుండే విలువలు నేర్పించకపోతే, పదవ తరగతికి వచ్చేసరికి మేము వారిని మార్చలేం. సంస్కారం అనేది ఒక సబ్జెక్టు కాదు, అది ఒక జీవన విధానం. గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే (NMHS) 2024 ప్రకారం 14 నుండి 18 సంవత్సరాల వయసు గల పిల్లల్లో 38% మంది మేము తల్లిదండ్రులతో సన్నిహితంగా ఉండలేకపోతున్నాం అని వెల్లడించారు. దాదాపు 62% మంది పిల్లలు నాకు ఏదైనా సమస్య వస్తే ఇంట్లో చెప్పుకోవడానికి భయంగా లేదా ఇబ్బందిగా ఉంది అని చెప్పారు.

దీని అర్థం ఏమిటి? తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంభాషణ (Communication) తెగిపోయింది. భౌతికంగా ఒకే ఇంట్లో ఉంటున్నా, మానసికంగా వేర్వేరు ద్వీపాల్లో బతుకుతున్నారు. పాశ్చాత్య దేశాల్లో ఫ్రీ రేంజ్ పేరెంటింగ్ అని ఒక పద్ధతి ఉంది. అక్కడ పిల్లలకు స్వేచ్ఛ ఇస్తూనే, సామాజిక బాధ్యతలను, నైతిక విద్యను పాఠశాల స్థాయి నుంచే కఠినంగా అమలు చేస్తారు. కానీ మనం కేవలం ఆ స్వేచ్ఛను మాత్రమే



దిగుమతి చేసుకున్నాం. పరీక్షల్లో ర్యాంకులు, మెడిసిన్ సీట్లు మాత్రమే సక్సెస్ అని నూరిపోస్తూ, ఒక మంచి మనిషి గా ఎలా బతకాలో నేర్పడంలో వెనుకబడ్డాం. విలువలు నేర్పించడం అంటే రోజూ గంటల కొద్దీ నీతి పాఠాలు చెప్పడం కాదు. విలువలు పుస్తకాల్లో చదివి నేర్చుకునేవి అంతకన్నా కాదు. అవి నిత్య జీవితంలో తల్లిదండ్రుల ప్రవర్తనను చూసి పిల్లలు ఒంటబట్టించుకునేవి. ఒక తండ్రి ఆఫీసు పని కోసం ఫోన్లో చిన్న అబద్ధం చెబుతుంటే, పక్కనే ఉన్న కొడుకు అబద్ధం ఆడటం తప్పు కాదు, అది ఒక అవసరం అని నేర్చుకుంటాడు. ఒక తల్లి ఇంట్లో పనిమనిషితో హీనంగా మాట్లాడుతుంటే, ఆ పిల్లలు ఇతరులను గౌరవించడం ఎలా నేర్చుకుంటారు? సమాజంలో బలవంతుడే గెలుస్తాడు, ఎలాగైనా సంపాదించాలి అనే సందేశం నిరంతరం అందుతున్నప్పుడు, పిల్లలకు నిజాయితీగా ఉండు అని చెప్పే మాటలు నీటి మూటలవుతాయి. పిల్లలు మన మాటలను అనుసరించరు, మన చేతలను అనుకరిస్తారు. తల్లిదండ్రుల ప్రవర్తనే వారి మొదటి పాఠ్యపుస్తకం.

ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్ అనేది పిల్లల శరీరంలో ఒక భాగంగా మారిపోయింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ వంటివి తక్షణ సంతృప్తి (Instant Gratification)ని అలవాటు చేస్తున్నాయి. ఏదైనా కావాలంటే వెంటనే జరిగిపోవాలి, లేదంటే అసహనం! దీనివల్ల ఓపిక, శ్రమ, వేచి ఉండటం వంటి అత్యున్నత మానవ లక్షణాలు అంతరించిపోతున్నాయి. ఒక పరిశోధన ప్రకారం, రోజుకు నాలుగు గంటలకు పైగా స్క్రీన్ సమయం (Screen Time) గడిపే పిల్లల్లో సహానుభూతి (Empathy) అనేది 23% తక్కువగా ఉంటుందట. పక్కవాడి బాధను అర్థం చేసుకునే గుణం లేకపోతే, రేపటి సమాజం ఎంత క్రూరంగా ఉంటుందో ఊహించడానికే భయమేస్తుంది. అయితే, టెక్నాలజీని మనం పూర్తిగా నిందించలేం. కత్తితో కూరగాయలు కోయొచ్చు, వేళ్లు కోసుకోవచ్చు. దాన్ని ఎలా వాడాలో నేర్పించని మనదే తప్పు. విలువల విద్య అనేది కేవలం పాఠశాలల్లో ఒక పీరియడ్‌కు పరిమితం కాకూడదు. ఇది ఇంటి నుండే మొదలవ్వాలి. రోజుకు కనీసం ఒక పూట అందరూ కలిసి భోజనం చేస్తూ, ఫోన్లకు దూరంగా మాట్లాడుకోవాలి. పిల్లలతో స్నేహంగా ఉండటం అంటే వారి తప్పులను సమర్థించడం కాదు. ప్రేమతో కూడిన క్రమశిక్షణ ఉండాలి. 'నో' చెప్పాల్సిన చోట ఖచ్చితంగా చెప్పాలి. అదే అత్యంత ప్రేమగల చర్య. మన తెలుగు సంస్కృతిలో అతిథి దేవో భవ, వసుదైక కుటుంబం వంటి గొప్ప భావనలు ఉన్నాయి. మన పండుగలు, సంప్రదాయాల వెనుక ఉన్న పరమార్థాన్ని పిల్లలకు వివరించాలి. ఇతరులకు సహాయం చేయడం, జంతువుల పట్ల ప్రేమ చూపడం, పర్యావరణాన్ని కాపాడటం వంటివి పిల్లలతో కలిసి తల్లిదండ్రులు చేయాలి. నేటి తరం పిల్లలు పాడైపోయారని నిరాశ చెందాల్సిన పని లేదు. వారు గత తరాల కంటే చాలా తెలివైన వారు, వేగంగా స్పందించే వారు. వారికి కావాల్సిందల్లా సరైన దిశానిర్దేశం. మనం వారికి ఇచ్చే గొప్ప ఆస్తి బ్యాంక్ బ్యాలెన్స్ కాదు, వారు సమాజంలో తల ఎత్తుకుని బతికేలా చేసే సంస్కారం . స్వేచ్ఛ ఇవ్వండి కానీ దానికి బాధ్యతను జోడించండి. సౌకర్యాలు కల్పించండి కానీ కష్టపడటంలోని తృప్తిని కూడా పరిచయం చేయండి. రేపటి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత మన అందరిది. తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, బాధ్యతాయుతమైన సమాజంగా మనం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది.

# 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కింద తెలంగాణలోని ప్రాధాన్య జిల్లాలపై న్యాకో ప్రత్యేక దృష్టి

**- హైదరాబాద్‌లో న్యాకో ఆధ్వర్యంలో 'సురక్ష సంకల్ప్ కార్యశాల'**

**- తెలంగాణలోని 19 ప్రాధాన్య జిల్లాల నుంచి హాజరైన అధికారులు**

హైదరాబాద్ వెలుతురు 25 మార్చి 2026:

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) 25 మార్చి 2026న హైదరాబాద్‌లో 'సురక్ష సంకల్ప్ కార్యశాల'ను నిర్వహించింది. జాతీయ కార్యక్రమమైన 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కింద జిల్లా స్థాయిలో హెచ్ఐవీ నివారణ చర్యలను బలోపేతం చేయడానికి ఈ కార్యశాల ఏర్పాటుచేసింది. ఎయిడ్స్ నివారణకు సంబంధించి రాష్ట్రంలోని ప్రాధాన్యత కలిగిన జిల్లాల్లో లక్షిత కార్యక్రమాలను వేగవంతం చేయడానికి ఈ కార్యశాల జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను ఒకచోటకు చేర్చింది. ఈ వర్క్‌షాప్‌కు న్యాకో డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షత వహించారు. తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ (టీఎస్ఏసీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ గుప్తా మాట్లాడుతూ.. "భారతదేశ హెచ్ఐవీ నివారణ చర్యలకు ప్రాధాన్య జిల్లాలు కేంద్రబిందువుగా ఉన్నాయి. హెచ్ఐవీ నివారణ దిశగా ఫలితాలను మెరుగుపరచడానికి, జాతీయ లక్ష్యాల దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో కేంద్రీకృత, డేటా-ఆధారిత కార్యక్రమాలు కీలకం" అని పేర్కొన్నారు.






మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా స్థాయిలో ప్రణాళిక, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందని ఆయన అన్నారు. తెలంగాణలోని వయోజనుల్లో హెచ్ఐవీ ప్రాబల్యం 0.41% ఉండటం, రాష్ట్రంలో సుమారు 1,56,961 మంది హెచ్ఐవీతో జీవిస్తున్న నేపథ్యంలో జాతీయ హెచ్ఐవీ నివారణలో తెలంగాణ కీలకమైన రాష్ట్రంగా కొనసాగుతోంది. రాష్ట్రంలో విస్తృతంగా మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ అమలు, పర్యవేక్షణ కోసం 19 జిల్లాలను ప్రాధాన్యత కలిగిన జిల్లాలుగా గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు ఈ కార్యశాలలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్య జిల్లాలుగా గుర్తించిన హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, సిద్ధిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగాం, వికారాబాద్, కామారెడ్డి, హన్మకొండ, సంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యశాల సందర్భంగా జిల్లా బృందాలు మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ పురోగతిపై నివేదికన సమర్పించాయి. కార్యాచరణ, క్షేత్రస్థాయి సవాళ్లను చర్చించాయి. జిల్లావారీగా డేటా-ఆధారిత కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి నిర్మాణాత్మక చర్చలు జరిపాయి. హెచ్ఐవీ నివారణ వ్యూహాలను బలోపేతం చేయడం, నిర్ధారణ పరీక్ష సేవలను విస్తరించడం, యాంటీరెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) అనుసంధానం, చికిత్స కొనసాగింపును మెరుగుపరచడం, వైరల్ లోడ్ అణచివేతను పెంచడం, ముప్పు అధికంగా ఉన్న జనాభాలో లక్షిత కార్యక్రమాలను పెంచడంపై ప్రధాన దృష్టితో ఈ చర్చలు జరిగాయి. ఈ వేదిక జాతీయ, రాష్ట్ర, జిల్లా భాగస్వాముల మధ్య సహకారానికి, సమస్యల పరిష్కారానికి, అనుభవాలను పంచుకోవడానికి, సమన్వయానికి వీలు కల్పించింది, తద్వారా మరింత సమన్వయంతో కూడిన హెచ్ఐవీ నివారణ చర్యలకు దోహదపడనుంది.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించుకోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దెనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సపహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్-జై సంవిధాన్-జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

# సంపాదకీయం.. ఆయిల్ సంక్షోభంలో భారత్ !



మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్తితులు రాబోతున్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి. దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్నమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చున్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించుకోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి.

ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది.

1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు. రేపు మరెలాంటి ముప్పు వస్తుందో చెప్పలేం. అందువల్ల భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగుల వేయాలి. ప్రజలను అందుకు సన్నద్ధం చేయాలి.

## యుద్ధం ముగింపు కోసం యత్నాలు

**- ఇరాన్‌కు 15 డిమాండ్ ముందు పెట్టిన ట్రంప్**

**- 450 కిలోల యురేనియం అప్పగింత ముఖ్యం**

**వాషింగ్టన్,మార్చి25( వెలుతురు):**
పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పశ్చిమాసియాకు అదనపు బలగాలను పంపించేందుకు అమెరికా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్ (ఎసజీని)కు పంపించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం రాసింది. ఈ సీజ్గ÷ర్ ఎ÷-లాన్ గురించి ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే, ఈ కథనాలపై వైట్‌హౌస్ నుంచి స్పందన రాలేదు. యుద్ధం ముగింపు కోసం ఈ ప్రణాళికలో టెహ్రాన్‌కు కొన్ని షరతులు విధించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను నిలిపివేసే ప్రయత్నంలో భాగంగా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇరాన్‌కు 15 సూత్రాలతో కూడిన వివరణాత్మక కాల్పుల విరమణ ప్రతిపాదనను పంపినట్లు తెలుస్తోంది. పలు అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ ప్రణాళికను పాకిస్థాన్‌కు చెందిన మధ్యవర్తుల ద్వారా అందించారని తెలుస్తోంది. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య కొత్త చర్చలకు ఆతిథ్యమిచ్చేందుకు కూడా పాకిస్థాన్ ముందుకొచ్చింది. పశ్చిమాసియా ప్రాంతాల్లో ఇప్పటికే మోహరించిన సుమారు 50వేల మంది సిబ్బందికి తోడు మరో వెయ్యి మంది సైనికులను పంపేందుకు యూఎస్ సైన్యం సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ దౌత్యపరమైన చర్య చోటుచేసుకుంది. కాల్పుల విరమణ ప్రతిపాదనలతో పాటు 2 మెరైన్ ఎక్స్‌పెడిషనరీ యూనిట్లను కూడా పశ్చిమాసియాకు పంపుతోంది అమెరికా. ఇవి సుమారు 5వేల మంది మెరైన్‌లు సహా వేల మంది సైనికులను తీసుకువస్తాయి. మరోవైపు.. ఇరాన్‌పై తమ సైనిక ఒత్తిడిని కొనసాగించాలని అమెరికాను పట్టుబడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా చర్యలు తీవ్ర విస్మయానికి గురిచేస్తున్నాయి. ఈ రీతిలో వాషింగ్టన్ కాల్పుల విరమణ ప్రణాళికను ముందుకు తెస్తుందని ఇజ్రాయెల్ ఊహించలేదని మీడియా కథనాలు నివేదిస్తున్నాయి.యుద్ధాన్ని ముగించేందుకు కఠినమైన షరతులను విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. అందులో యురేనియం శుద్ధిని నిలిపివేయడం, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తిరిగి తెరవడం సహా అమెరికా, ఇజ్రాయెల్ ప్రకటించిన యుద్ధ లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా కీలక చర్యలున్నాయి.ఇరాన్ తన ప్రస్తుత అణు సామర్థ్యాలను విచ్ఛిన్నం చేయయడం. ఇరాన్ ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని హామీ ఇవ్వడం. ఇరాన్ భూభాగంలో యురేనియం సుసంపన్నం చేయడానికి అనుమతించక పోవడం.సుమారు 450 కిలోల యురేనియం నిల్వలో 60 శాతాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలోని అణు కేంద్రాలను కూల్చివేయడం.ఇరాన్ వ్యాప్తంగా ఐఏఈఏకు పూర్తి పారదర్శకత కల్పించడం.ఇరాన్ తన ప్రాంతీయ మధ్యవర్తిత్వ కార్యకలాపాలను నిలిపివేయడం.మిత్రపక్ష మిలీషియాలకు మద్దతును నిలిపివేయడం. హోర్ముజ్ జలసంధిని ప్రపంచవ్యాప్త రవాణాకు తెరిచి ఉంచడం.ఇరాన్ క్షిపణి పరిధిని, పరిమాణాలను పరిమితం చేయడం. భవిష్యత్తులో క్షిపణి వినియోగం కచ్చితంగా ఆత్మరక్షణకు మాత్రమే వినియోగించడం. పైన పేర్కొన్న పలు కీలక ప్రతిపాదనలతో కూడిన కాల్పుల విరమణ ప్రణాళికను ఇరాన్‌కు అమెరికా పంపినట్టు సమాచారం.

## పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తతలు

**- కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ దాడి**

**టెహ్రాన్,మార్చి25( వెలుతురు):**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు రోజు రోజుకీ భీకర స్థాయికి చేరుకుంటున్నాయి. యుద్ధం మొదలైనప్పటికి నుంచి గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. తాజాగా కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్రోన్ ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌కు చెందిన ఒక డ్రోన్లు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా దాడులకు దిగాయి. అందులో ఒక డ్రోన్ విమానాశ్రయ పరిసరాల్లోకి దూసుకువచ్చి అక్కడే ఉన్న ఆయిల్ ట్యాంకర్ ను ఢీ కొట్టింది.ఈ ప్రమాదం దాటికి ట్యాంకర్ పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. విమానాశ్రమం పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ డ్రోన్లతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. తాజా దాడి కువైట్ భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంటలు అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇరాన్ నుంచి వచ్చిన పలు డ్రోన్లు, క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, కేవలం ఆస్తి నష్టం జరిగిందని కువైట్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది.

## ట్రంప్ మరో కీలక నిర్ణయం

**- ఇరాన్ భూభాగానికి సమీపంలో దళాల మోహరింపు**

**- అందబాటులో 2000 మంది ఎలైట్ బలగాలు**



**వాషింగ్టన్,మార్చి25( వెలుతురు):**
ఇరాన్‌తో శాంతి చర్చలు జరుగుతున్నట్లు చెప్పిన ట్రంప్.. మరో కీలక ఆదేశం ఇచ్చారు. ఇరాన్ భూభాగానికి సమీపంలో రెండు వేల మంది పారాట్రూపర్లను మోహరించారు. ఏ క్షణమైన వాళ్లు దాడికి పాల్పడే అవకాశాలు ఉన్నాయి. భూతల దాడులు చేస్తే తిప్పికొడుతామని ఇరాన్ చెబుతున్న నేపథ్యంలో.. పెంటగాన్ అధికారులు కొత్త ఆదేశాలు జారీ చేశారు. అమెరికన్ ఆర్మీలోని 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌కు చెందిన సుమారు 2000 మంది ఎలైట్ బలగాలు అందబాటులో ఉండనున్నాయి. ఇరాన్ భూభాగానికి అతిసమీపంగా ఆ దళాలు మోహరించి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు, న్యూయార్క్ టైమ్స్ కథనాలు రాశాయి. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల లోపే విమానాశ్రయాలను, ఎంబసీలను సీజ్ చేసే సత్తా ఈ దళానికి ఉంటుంది. వీలైనంత మందిని తరలించగలరు కూడా. ఈ వారం చివరలో మరో 2500 మెరైన్లు కూడా గ్రౌండ్ ఆపరేషన్ కోసం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఖర్గ్ దీవిలో ఉన్న ప్రధాన ఆయిల్ ఎగుమతి కేంద్రాన్ని సీజ్ చేయాలన్న ఉద్దేశంతో అమెరికా ఉన్నట్లు భావిస్తున్నారు. దీని కోసమే పారాట్రూపర్లు రెఢీ అవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌కు సమీపంగా వస్తే అమెరికా సైనికులను ఎలా ఎదుర్కోవాలో తమ దళాలకు తెలుసు అని ఇటీవల ఇరాన్ సీనియర్ మిలిటరీ అడ్వైజర్ అలీ అక్బర్ అహ్మదిన్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎయిర్‌బార్న్ డివిజన్ బేస్ నార్త్ కరోలినాలో ఉన్నది. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల్లోనే ఈ ప్రాంతం నుంచి టా÷-గ్గ÷ట్‌కు ఈ దళం వెళ్లగలదు. ఇమ్మిడియేట్ రెస్పాన్స్ ఫోర్స్(ఐఆర్ఎఫ్) అని కూడా ఈ దళాన్ని పిలుస్తారు. 2021లో ఈ దళం ఆఫ్ఘనిస్తాన్ ఆపరేషన్‌లో పాల్గొన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా ప్రభుత్వం తమ ఆపరేషన్స్ నిలిపివేసిన సమయంలో.. హమిద్ ఖర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ దళం వెళ్లింది. ఎయిర్‌బార్న్ డివిజన్‌లో మొత్తం మూడు కంబాట్ బృందాలు ఉంటాయి. ఒక్కొక్క బృందంలో సుమారు 4 వేల మంది సైనికులు ఉంటారు. ఏవియేషన్ బ్రిగేడ్‌లో అటాక్, ట్రాన్స్‌పోర్ట్, కార్గో హెలికాప్టర్లు ఉంటాయి. ఓ ఆర్టిల్లరీ యూనిట్, లాజిస్టిక్స్ బ్రిగేడ్ కూడా ఉంటాయి. 82వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌ను మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఏర్పాటు చేశారు. కానీ యుద్ధం ముగిసిన తర్వాత డిమొబిలైజ్ చేశారు. అయితే మళ్లీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ సైనిక బృందాన్ని తీసుకొచ్చారు. 1942లో అమెరికన్ ఆర్మీకి చెందిన ఫస్ట్ ఎయిర్‌బార్న్ డివిజన్‌గా రూపాంతరం చెందింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 82వ ఎయిర్‌బార్న్ దళం పలు యుద్ధాల్లో పాల్గొన్నది. వియత్నం, గ్రెనడా, పనామా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమాసియాలో ఐసిస్ ఆపరేషన్స్‌లో ఈ దళం విధులు నిర్వర్తించింది.

## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

**- నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత**

**- బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు**

**హైదరాబాద్,మార్చి25( వెలుతురు):**
అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో




తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి. నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింద్గి÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఒ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతు న్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలి కంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఒ, ఎక్షఅఒ, ఃఖఅఒ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ూక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

## కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

**- ఫార్ములా రేస్ కేసు పెట్టిందే అందుకు**

**- పునరుద్ఘాటించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్**



**హైదరాబాద్,మార్చి25( వెలుతురు):**
ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలైందని.. ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలు, యంత్రాంగం అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నా.. బ్యాంక్ ద్వారా అధికారికంగా నిధులు బదిలీ చేసిన ఫార్ములా-ఈ అంశం మీద మాత్రమే కేసు పెట్టగలిగారని తెలిపారు. ఈ ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం ఎంత నిస్పృహలో ఉందో చూపించడమే కాకుండా, మా హయాంలో జరిగిన మచ్చలేని పాలనకు సర్టిఫికేట్ లాంటిదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఈ ఛార్జ్‌షీట్ ద్వారా స్పష్టం అవుతోందని కేటీఆర్ తెలిపారు. కేవలం అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని స్పష్టం చేశారు. ఫార్ములా-ఈ రేస్ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన ?49 కోట్ల బ్యాంక్-టు-బ్యాంక్ నిధుల బదిలీని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్ అంటుందా? అని ప్రశ్నించారు. స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందామని సవాలు విసిరారు.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

# శంకరపల్లిలో అభివృద్ధి దిశగా వేగం

**- 99 రోజుల ప్రణాళిక అమలుపై సమీక్ష సమావేశం**





**శంకర్ పల్లి, వెలుతురు మార్చి 25:** శంకర్ పల్లి మండల కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్ ఆధ్వర్యంలో వారాంత సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ కీలక అంశాలపై చర్చించారు. ప్రజాపాలన–ప్రగతి కింద అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రామాల్లో శానిటేషన్ మెరుగుదల, గ్రామపంచాయతీ ఆస్తుల సంరక్షణ, వినియోగంపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్తగా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం, పూర్తి అయిన ఇళ్ల వివరాలను పరిశీలిస్తూ, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీడీవో సూచించారు. “తెలంగాణ రైజింగ్ లోగోను ప్రతి గ్రామంలో ఉదయం వేళల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే నర్సరీల అభివృద్ధి, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పన్నుల వసూళ్లలో 100 శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధికి ఆదాయ వనరులు బలోపేతం కావాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎం పి డి వో వెంకయ్యగౌడ్ మాట్లాడుతూ, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తే మాత్రమే గ్రామాభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో గిరిరాజు, సూపరింటెండెంట్ సిబ్బంది, హౌసింగ్ ఏ ఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల త్యాగం స్ఫూర్తిదాయకం...

**- పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సరళక్క..**




**హైదరాబాద్, వెలుతురు మార్చి 25:** భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ ల త్యాగాలు దేశ యువతకు స్ఫూర్తిదాయకమని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళక్క అన్నారు. ఈ మేరకు హబ్సిగూడలోని ఒమేగా డిగ్రీ కళాశాలలో పిడిఎస్ యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి వంశీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరళక్క మాట్లాడుతూ, నేటి తరానికి వారి ఆలోచనలు మార్గదర్శకమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. పిడిఎస్ యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే గణేష్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం భగత్ సింగ్ పోరాడిన విధానం యువత అనుసరించాల్సినదిగా చెప్పారు. విద్యార్థులు చైతన్యంతో ముందుకు వచ్చి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ప్రాంగణం మార్మోగించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇది సమిష్టి విజయం వి రఘునాథ్...!

**- బార్ కౌన్సెల్ ను బాధ్యతాయుతంగా తీర్చి దిద్దెందుకు సహకరిద్దాం...!**

**- నిస్వార్థంతో గెలిపించిన ప్రతి అడ్వకేట్ కు ఈ విజయం అంకితం...!**

**- సామాజిక స్పృహతో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు...!**

**- ఇది మీ అందరి గెలుపు ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటూ కలుపుకెళ్తా...!**

**- వేరోజు రఘునాథ్ సీనియర్ డిజిగ్నేటెడ్ కౌన్సిల్ తెలంగాణ బార్ కౌన్సిల్**



**హైదరాబాద్ వెలుతురు మార్చ్ 25, 2026:** తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 203 మంది సభ్యులు పోటీ చేయగా ఒక్కొక్కరు ఒక్కో మార్గంలో గెలుపుకై ప్రయత్నం చేయగా వి రఘునాథ్ చేసిన ప్రయత్నం సామాజిక స్పృహతో సమాజానికి సేవ చేస్తే సమాజం నీకు అవకాశం ఇస్తుంది. అందేలమెక్కిస్తుంది అనేలా ఒక మంచి మెస్సేజ్ ను ఈ గెలుపుతో అందించిందని చెప్పకనే చెప్పినట్టుగా సామాజిక స్పృహతో గత ముప్పైఐదు ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో.. మరెన్నో ఒడి దుడుకులను, మరెన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తలబడి, నిలబడి గెలిచిన గెలిపించిన ప్రతి ఒక్క అడ్వకేట్ కు ఈ గెలుపు అంకితం అనేలా చేశారని చర్చ జరగటం ఎంతో సంతోషంగా ఉందని రఘునాథ్ అన్నారు. ఈ క్రమంలో నిస్వార్థంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల న్యాయవాదులు నిస్వార్థంతో సహకరించిన తీరు అభినందనీయం అని అన్నారు. ఇది నా ఒక్కరి గెలుపుకాదు మీ అందరి గెలుపని కావున సమిష్టిగా మీ అందరిని కలుపుకొని పోతూ అందరికి అందుబాటులో ఉంటూ తెలంగాణ బార్ కౌన్సిల్ ని బాధ్యతాయుతంగా తీర్చి దిద్దెందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.




బుధవారం రోజున ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ మరియు హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ నియోజకవర్గం లోని ప్రజలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ మరియు సి ఎం ఆర్ ఎఫ్ చెక్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ వెలుతురు మార్చి 25:**

# వదంతుల దెబ్బకు బంకుల వద్ద రద్దీ

**- ఇంధన కొరత లేదని ప్రభుత్వ భరోసా**

**- పానిక్ బాయింగ్ వల్ల కృత్రిమ కొరత**

**- ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల సూచన**










**శంకర్ పల్లి వెలుతురు మార్చి 25 :** మండలంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత ఉందన్న వదంతులు ప్రజల్లో ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ ప్రచారాల ప్రభావంతో గత రెండు రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద భారీగా క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. వాహనదారులు ముందుగానే ఇంధనం నిల్వ చేసుకోవాలని తొందరపడటంతో పరిస్థితి మరింత ఉత్కంఠభరితంగా మారింది. అయితే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మరియు చమురు డీలర్ల అసోసియేషన్ ఈ వదంతులను పూర్తిగా ఖండించాయి. ఇంధన కొరత ఎక్కడా లేదని స్పష్టం చేస్తూ, ప్రజల ఆందోళనే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని పేర్కొన్నాయి. ప్రజలు ఒక్కసారిగా బంకులకు చేరుకోవడంతో “పానిక్ బాయింగ్” పరిస్థితి ఏర్పడి, కృత్రిమ కొరతకు దారితీసిందని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితికి పలు కారణాలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా సరఫరా నిలిచిపోతుందనే ప్రచారం ప్రజల్లో భయాన్ని పెంచింది. అలాగే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు డీలర్లకు క్రెడిట్ పరిమితులను తగ్గించాయన్న వార్తలు, నగదు చెల్లింపులపై ఉన్న నిబంధనలు కూడా ఈ పరిస్థితిని ప్రభావితం చేశాయి. ఇక ప్రభుత్వ స్పందన విషయానికి వస్తే, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ఎటువంటి కొరత లేదని స్పష్టం చేస్తూ, ప్రజలు అనవసరంగా భయపడకుండా ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ‘నో స్టాక్’ బోర్డులు కనిపించినప్పటికీ, అవి సరఫరాలో తాత్కాలిక అంతరాయం వల్లే జరిగిందని అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే అన్ని బంకులకు సరఫరా పునరుద్ధరించబడుతుందని హామీ ఇచ్చారు.

# ఏఎస్ రావునగర్‌లో ఫుడ్ పాయిజనింగ్ కలకలం

## మండి బిర్యానీ తిని కుటుంబానికి అస్వస్థత









**ఏ ఎస్ రావునగర్, మార్చి 25 వెలుతురు :** కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్‌లో ఫుడ్ పాయిజనింగ్ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికంగా నిర్వహణలో ఉన్న “డెలీషియస్ మండి” హోటల్‌లో భోజనం చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.సమాచారం మేరకుడ ఏఎస్ రావునగర్‌కు చెందిన ఉమేష్, రాధిక, నరసింహలతో పాటు నాలుగేళ్ల బాలుడు విహాల్ కలిసి మూడు రోజుల క్రితం సదరు హోటల్‌కు వెళ్లి మండి బిర్యానీ భోజనం చేశారు. ఆహారం తీసుకున్న కొద్దిసేపటికే వారందరికీ ఒక్కసారిగా వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు వెంటనే జమ్మిగడ్డ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. వైద్యుల పరిశీలనలో తీవ్ర ఫుడ్ పాయిజనింగ్‌గా నిర్ధారణ కాగా, గత మూడు రోజులుగా వారు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా చిన్నారి విహాల్ ఆరోగ్య పరిస్థితి పట్ల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నప్పటికీ, ఇంకా వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. ఈ ఘటనకు హోటల్‌లో వడ్డించిన నాసిరకం ఆహారమే కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ కుటుంబం ఈ పరిస్థితికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ సంఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏఎస్ రావునగర్ పరిధిలో ఇలాంటి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు ఇదే మొదటిసారి కాదని, గతంలో కూడా పలుమార్లు ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటున్నారు. ఆహార భద్రతా అధికారుల పర్యవేక్షణలో లోపాలున్నాయని విమర్శిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి “డెలీషియస్ మండి” హోటల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. ఈ ఘటనతో ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొనగా, బయట ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# వివేకానంద నగర్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం 200 మందికి పైగా పరీక్షలు



**కూకట్‌పల్లి, మార్చి 25 వెలుతురు:** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో సీనియర్ సిటిజన్ పార్క్ వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానికులు విశేషంగా స్పందించారు. మెడికవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 200 మందికి పైగా ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు డెంటల్ పరీక్షలు కూడా నిర్వహించారు. నిపుణులైన వైద్యులు ప్రత్యక్ష పర్యవేక్షణలో రోగులను పరీక్షించి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ప్రతినిధులు ప్రశాంత్ కుమార్, డేవిడ్ (సీనియర్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్)తో పాటు రమేష్, రాజు యాదవ్, త్రినాధ్ కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ శాఖ అధికారులతో దోమకొండ సర్పంచ్ అయిరేని నర్సయ్య సమీక్ష సమావేశం

**- ఏబిస్విచ్చులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ అధికారులకు ఆదేశం**


**- ఇండ్లపై నుండి వెళ్లే కరెంటు తీగలను అక్కడి నుండి తీసివేయాలని సూచన**


**- ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ డంపింగ్ యార్డ్ కి రూ. 50 లక్షల నిధులు మంజూరు**

**- దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 25** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ డంపింగ్ యార్డ్ నిర్వహణకు డీ ఆర్ డీ ఓ స్వచ్ భారత్ నుంచి 40 లక్షల రూపాయల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో, 10 లక్షలు రూపాయలు దోమకొండ గడికోట ట్రస్ట్ నిర్వాహకులు కామినేని శోభన అనిల్ కుమార్లు విద్యుత్తు సప్లై నిర్వహణకు మంజూరు చేసినట్లు సర్పంచ్ ఐరెని నరసయ్య తెలిపారు. బుధవారం దోమకొండ గ్రామపంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన నరసయ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమకొండలో ఇండ్ల నిర్మాణం చేస్తున్న చోట విద్యుత్ వైర్లు పై నుండి ఉన్నందున నిర్మాణం చేసేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాటిని వెంటనే అక్కడినుండి తీసివేయాలని సూచించారు. అలాగే దోమకొండలో ఎక్కడైనా సమస్య వస్తే విద్యుత్ను పూర్తిగా బంద్ చేస్తున్నారని, అలాకాకుండా ఎబి స్విచులను అమర్చితే ఏ కాలనీలో విద్యుత్ సమస్య తలెత్తితే అక్కడే విద్యుత్తు బందు చేసుకోవచ్చని ఇతర కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలవకుండా ఉంటాయని అన్నారు. వేసవికాలంలో ప్రజలకు విద్యుత్ పట్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)మార్చి 25** రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యు పి హెచ్ సి)ను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి సేవల నిర్వహణపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రిలో శుభ్రత, వైద్య సిబ్బంది సమయపాలన, రోగుల పట్ల వ్యవహార శైలి వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారి సాయి ఈశ్వరి, సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కామారెడ్డి ఆర్ డి ఓ గా యన్ వై గిరి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 25**



కామారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ డి ఓ గా యన్ వై .గిరి బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ,గా విధులు నిర్వహించిన వీణా బదిలీ పై ఎండోమెంట్ శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా డిప్యుటేషన్ పై నియమించారు.

# రోహిత్ వేముల చట్టాన్ని అడ్డుకుంటాం

**- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి**



**కరీంనగర్ వెలుతురు మార్చి 25:**

అగ్రవర్ణ విద్యార్థులను వేదింపులకు గురి చేసి, మానసికంగా కుంగతీయలని విద్య సంస్థలలో రోహిత్ వేముల చట్టాన్ని అడ్డుకొని తీరుతామని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రోహిత్ వేముల చట్టం తీసుకువచ్చి అగ్రవర్ణ విద్యార్థులను తెలంగాణ రాష్ట్రంలో చదవకుండా చెయ్యాలనేది ఒక కుట్రపూర్తంగా ప్రభుత్వం ఆడుతున్న నాటకం అని సంధి తిరుపతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే తరగతి గదిలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓసి విద్యార్థులు ఇప్పటివరకు చదువుకోవడం జరిగింది, కానీ రోహిత్ వేముల చట్టం వచ్చిన తర్వాత అగ్రవర్ణ విద్యార్థులు క్లాస్ రూమ్ లో ఒకే బెంచ్ లో కూర్చోవాలన్నా భయభ్రాంతులకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ చట్టం ఎక్కువగా అగ్రవర్ణ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టి అగ్రవర్ణ విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రభావం చూపుతుంది. రోహిత్ వేముల చట్టం ద్వారా అగ్రవర్ణం విద్యార్థులను బ్లాక్ మెయిల్ చేసి లేనిపోని కేసుల్లో ఇరికించి చదవకుండా చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర అని ఆయన అన్నారు. ముఖ్యంగా అగ్రవర్ణ అమ్మాయిలను టార్గెట్ గా చేసి వారికి నచ్చినట్టుగా ప్రవర్తించి బ్లాక్ మెయిల్ ద్వారా లొంగదీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ చట్టం ప్రభుత్వం అగ్రవర్ణాలపై ఒక పథకం ప్రకారం కుట్రలు పన్నుతుంది అగ్రవర్ణ ప్రజలను బతకకుండా చేస్తుందని అన్నారు. తాజాగా ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు విధి విధానాలను రూపకల్పన క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రెడ్డి సామాజిక వర్గం అనుకున్నది ఒక్కటి అయ్యింది ఒక్కటి, కక్షగట్టి రెడ్డి సామాజిక వర్గాన్ని అనుగదొక్కడం జరుగుతుంది. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన ఈ ప్రభుత్వాన్ని వాళ్ళు తీసుకునే నిర్ణయాలను చట్టాల ద్వారానే ఎదుర్కొంటాం అని సంధి తిరుపతి రెడ్డి అన్నారు.

# వృద్ధ తల్లిదండ్రుల విషయంలో ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 25:**

పిల్లల మీద నూటికి 95 శాతం మంది తల్లిదండ్రులు ఫిర్యాదు చేయరు.అది తల్లిదండ్రుల గొప్పతనం... ప్రభుత్వం ఆలోచన చేయాలి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తల్లిదండ్రులను వారి సంతానం నిరాదరణకు గురి చేసిన సందర్భాల్లో, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజా ప్రజా ప్రతినిధుల వారి జీతం నుండి కొంత శాతం లేదా నిర్దిష్ట మొత్తం కట్ చేసి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే విధంగా బిల్లు తీసుకురావడం నిజంగా అభినందనీయమైన విషయం అని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా అన్నారు. ఈ నిర్ణయం వృద్ధ తల్లిదండ్రుల భద్రతకు తోడ్పడటమే కాకుండా, కుటుంబ బాధ్యతలను గుర్తు చేసే ముఖ్యమైన చర్యగా నిలుస్తుంది.ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.అయితే వాస్తవ పరిస్థితుల్లో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఫిర్యాదు చేయరు. అది తల్లిదండ్రుల గొప్పతనం. కుటుంబ పరువు, సంబంధాల మధ్య దూరం పెరగడం, మానసిక ఒత్తిడి వంటి కారణాల వల్ల వారు నిశ్శబ్దంగా బాధను భరిస్తూ కంట నీరు పెడుతున్నారు. ఇది నిజం.కాబట్టి, తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా చేయకపోయినా, వారి సంతానం జీతం నుండి కొంత మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఇది సాధ్యం కాకపోతే, ప్రభుత్వం స్వయంగా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి వృద్ధునికి ఆసరా పెన్షన్‌ను అందించే విధానం అమలు చేయాలి. ఇలా చేస్తే కుటుంబాల్లో అనవసరమైన వివాదాలు తగ్గి, రక్త సంబంధాల్లో గౌరవం మరియు ప్రేమ నిలుస్తాయి. ఈ విషయంపై ప్రభుత్వం మరింత సమగ్రంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తు,మా అభిప్రాయాన్ని తెలియపరుస్తున్నాము. రాపోలు నిర్మలా నరసింహ తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి సిరిపురం.



# తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ...

**హైదరాబాద్, మార్చి 25( వెలుతురు):**

ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా నగరంలో నిర్వహించే ఒక భారీ బహిరంగ సభకు ఆయన హాజరవుతారు. అక్కడి నుంచే వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుడతారని సమాచారం. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తెలంగాణకు రావడం ఇదే తొలిసారి కావడంతో, ఈ పర్యటనపై రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటిందిఈ పర్యటనలో భాగంగా వరంగల్‌లోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బీబీనగర్ ఎయిమ్స్ లో కొత్తగా నిర్మించిన పలు బ్లాకులు, అలాగే పూర్తయిన జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభించనున్నారు. వీటితో పాటు, హైదరాబాద్ నుండి యాదాద్రి వరకు ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ రెండో దశ రైల్వే ప్రాజెక్టుకు, ప్రాంతీయ వలయ రహదారి ఉత్తర భాగానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని భావిస్తున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై పార్టీ పరంగా సమాచారం రావడంతో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో శనివారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఈ విషయంపై ప్రాథమికంగా చర్చించారు. ప్రధాని మోదీ అధికారిక పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, కార్యక్రమాల టైమింగ్స్‌పై కేంద్ర ప్రభుత్వం నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ కార్పొరేషన్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ కీలక సమయంలో ప్రధాని మోదీ రాష్ట్రానికి రానుండటంతో తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.



# గ్రామ సర్పంచుల హక్కులను సాధిద్దాం...

**- దేశ ప్రగతిలో సర్పంచుల భాగస్వామ్యం వెలకట్టలేనిది**
**- జిల్లా సర్పంచుల పోరం అధ్యక్షుడిగా కొప్పుల వెంకటరెడ్డి నియామకం**
**- యాదాద్రి భువనగిరి జిల్లా సదస్సులో రాష్ట్ర వ్యవస్థాపక సాధాని భూమన్న యాదవ్**




**భువనగిరి మార్చ్ 25, (వెలుతురు న్యూస్ ):**

తెలంగాణ రాష్ట్రంలోని నూతన గ్రామపంచాయతీ సర్పంచులుగా ఎన్నికైన సర్పంచుల సమస్యల పరిష్కారానికి వారి హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక వివేరా హోటల్లో జిల్లా సర్పంచుల చైతన్య సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ హాజరై మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యం సాధించడానికి గ్రామ ప్రథమ పౌరులు సర్పంచుల ద్వారానే సాధ్యమవుతుందని ఆనాడే మహాత్మా గాంధీ బోధించారని అన్నారు. నేడు వారి ఆశయ సాధనకు పాటుపడుతున్న సర్పంచ్లకు అనేక సమస్యలతో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని గ్రామాలకు ఎన్నికైన సర్పంచులు గ్రామంలోని ప్రజా సమస్యలతో పాటు గ్రామ అభివృద్ధికి సంక్షేమానికి 24 గంటలు కృషి చేస్తున్న సర్పంచుల వేతనాలను 6500 నుండి 25 వేల వరకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర నిధులు రాష్ట్ర నిధులు పాటు గ్రామాలలోని సొంత గ్రామ పనుల నిధులను వెంటనే ఫ్రీజింగి తొలగించాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచులు ప్రజాసేవలో మంచి గుర్తింపు తీసుకొచ్చి గ్రామాలకు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా కొప్పుల వెంకటరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలుగా టేకు మంజుల, ప్రధాన కార్యదర్శిగా గిరి కంటి నిరంజన్ గౌడ్ ఉపాధ్యక్షులుగా తాండ్రా నారాయణస్వామి,జెన్నా సిద్ధులు,ఇటమోని గీతా యాదవ్, కార్యదర్శిగా చిన్నం బీరప్ప, ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్ సహాయ కార్యదర్శి ఒగ్గు రవళి రాణా ప్రతాప్ కోశాధికారిగా కాసులు అంజయ్య. ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు,కమిటీకి జిల్లా సర్పంచులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అండగా ఉంటానని సర్పంచ్ హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి కీర్తి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి అవినాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సుర్వి మల్లేష్ గౌడ్,రాష్ట్ర సలహాదారులు రవీందర్ యాదవ్,జిల్లాలోని వివిధ మండల ఫోరం అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి...!

**- కార్యాలయ సిబ్బంది, నిధుల లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు...**
**- పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు సమీకరించాలని వినతి...**
**- జిల్లా కలెక్టర్‌ను కోరిన మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్...**



**జహీరాబాద్ వెలుతురు, మార్చి 25:**

నూతనంగా ఏర్పాటు అయిన సంగారెడ్డి జిల్లా పరిధిలోని కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ బుధవారం సంగారెడ్డిలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రవీణ్యను కోహిర్ నూతన మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కోహిర్ మున్సిపాలిటీ ప్రజలు ప్రస్తుతం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ ఏర్పాటై కొద్ది రోజులే అయినప్పటికీ సరైన మౌలిక సదుపాయాలు, తగిన కార్యాలయ సిబ్బంది, అవసరమైన నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో రహదారులు, తాగునీటి సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి ప్రాథమిక అవసరాలు వెంటనే కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు మున్సిపాలిటీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చేందుకు జిల్లా పరిపాలన నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా కోహిర్ మండల పరిధిలో పలు పరిశ్రమలు ఉన్నందున వాటి ద్వారా సీఎస్ఆర్ నిధులు సమీకరించి కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పరిశ్రమలు సామాజిక బాధ్యతగా స్థానిక అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రవీణ్య కోహిర్ మున్సిపాలిటీ సమస్యలను సమగ్రంగా పరిశీలించి వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ తెలిపారు. కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధికి జిల్లా పరిపాలన పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని కలెక్టర్ భరోసా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

# అందుబాటులోకి జెన్ జీ కీ బోర్డు

**హైదరాబాద్, మార్చి 25( వెలుతురు):**




స్తుత కాలంగా డిజిటల్ యుగంగా మారిపోయింది. ఇంటర్నెట్ జీవితాన్ని, పనిని అత్యంత సులభతరం చేసింది. ఇంటి నుండే దూరపు బంధువులతో సంప్రదించడం, మాట్లాడటం సులభమైంది. సాంకేతికత కారణంగా, గంటల సమయం పట్టే పనులు ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతున్నాయి. మొత్తమ్మీద, ప్రస్తుత కాలం డిజిటల్ కమ్యూనికేషన్ యుగం, కానీ సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి సంఘటనలు ఈ డిజిటల్ కమ్యూనికేషన్‌కు అతిపెద్ద సవాలుగా మారాయి. దీనికి ప్రధాన కారణం అసురక్షిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అంటే అప్లికేషన్‌లను ఉపయోగించడం. విదేశాల నుండి పనిచేసే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సురక్షితం కాకపోవడమే పెద్ద సమస్య. అంటే, విదేశీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా భారతదేశంలోని సామాన్య ప్రజలు సురక్షితంగా లేరని తాజా నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల, ఇది జాతీయ భద్రతకు కూడా ముప్పుగా పరిగణించిందిఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, అనువాదిని ఏఐ సురక్షితమైన, నమ్మకమైన, పూర్తిగా స్వదేశీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చింది. హైప్డ్ సంవాదిని, దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ను అభివృద్ధి చేసింది. వీటిని లాంఛనంగా ప్రారంభించారు., దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ప్రస్తుతం 80 కోట్లకు పైగా భారత పౌరులు విదేశీయులు నిర్వహిస్తున్న డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడి ఉన్నారు. డేటా భద్రత, గోప్యత, భాషా సమ్మిళితత్వం వంటి సమస్యలు కీలకమయ్యాయి. సురక్షితమైన, స్వదేశీ, గోప్యతపై దృష్టి సారించిన ప్రత్యామ్నాయాల అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత ముఖ్యమైనదిగా మారిపోయాయి.అధిక ప్రచారం పొందుతున్న సంవాదిని గురించి, అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇది భారతదేశపు మొట్టమొదటి సిమ్-ఆధారిత, బహుభాషా, స్పామ్-రహిత గ్లోబల్ మెసెంజర్ అని అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్, డైనమిక్ చాట్ ఐడీల ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను పంచుకోకుండానే వ్యక్తిగత చాట్‌లు, గ్రూప్ చాట్‌లు, ఆడియో కాల్‌లు, వీడియో కాల్‌ల ద్వారా సురక్షితంగా సంభాషించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డివైస్-బైండింగ్, అధునాతన యాంటీ-స్పామ్ యంత్రాంగాలు దీనిని సైబర్ నేరాలు, మోసాలు, నకిలీ ఖాతాల నుండి సురక్షితంగా ఉంచుతాయని చంద్రశేఖర్ వెల్లడించారు.అనువాదిని ఏఐ అత్యంత ముఖ్యమైన ఫీచర్ గురించి మాట్లాడుతూ, 22 భారతీయ, 37 విదేశీ భాషలలో రియల్-టైమ్ టెక్స్ట్, వాయిస్ అనువాదాన్ని అందిస్తూ, దేశ భాషా వైవిధ్యాన్ని ఒక శక్తివంతమైన డిజిటల్ వారధిగా మారుస్తుందని సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ వివరించారు. ఇది 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భద్రత కోసం హైప్డ్ సంవాదినిలో వన్-ట్యాప్ ఎస్ఓఎస్ అత్యవసర ఫీచర్ కూడా ఉందని, ఇది లైవ్ లొకేషన్‌తో తక్షణ సహాయాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఇది ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హైప్డ్ సంవాదిని ప్రాంతీయ భాషలలో స్థానిక ఉపాధి, ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, గిగ్ అవకాశాలను అందిస్తూ, యువతకు వారి సొంత వాతావరణంలోనే అవకాశాలను కల్పిస్తుందని చంద్రశేఖర్ వివరించారు. భాషా అభ్యాస మాడ్యూళ్లు, సామాజిక భాగస్వామ్యం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గేమ్‌ల వంటి ఫీచర్లు దీనిని కేవలం సమాచార మార్పిడికి మాధ్యమంగానే కాకుండా, భాగస్వామ్యం, అభివృద్ధికి కూడా ఉపయోగపడే ఒక సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థగా మారుస్తాయని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ గురించి అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ఇది ఒక అధునాతన ఏఐ-ఆధారిత టైపింగ్, ఎక్స్‌ప్రెషన్ ప్లాట్‌ఫామ్. ఇది 22 భారతీయ, 70కి పైగా విదేశీ భాషలలో టైపింగ్, వాయిస్-టు-టెక్స్ట్, తక్షణ అనువాదాన్ని అందిస్తుంది. ఈ కీబోర్డ్ వినియోగదారులకు వారి మాతృభాషలో నిరాటంకమైన, వేగవంతమైన, సమర్థవంతమైన కమ్యూనికేషన్ అనుభవాన్ని అందిస్తుంది." అని తెలిపారు.దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్, జెన్‌జెడ్-శైలి స్లాంగ్ షార్ట్‌కట్‌ల వంటి అధునాతన ఫీచర్లను అందిస్తుంది. అధునాతన టైపింగ్ నియంత్రణలు, బహుళ లేఅవుట్‌లకు మద్దతు ఇస్తుంది. యాక్సెంట్‌లు, చిహ్నాలు, కరెన్సీలు దీనిని అత్యంత ఉపయోగకరంగా చేస్తాయి. అంతర్నిర్మిత క్లిప్‌బోర్డ్ మేనేజర్, ఉఎఈలు, స్టిక్కర్లు, కస్టమ్ ఎఐ స్టిక్కర్ల వంటి ఫీచర్లు వినియోగదారు అనుభవాన్ని మరింత ఆకర్షణీయంగా, భావవ్యక్తీకరణకు సహాయపడుతుంది. దీని ఫ్లోటింగ్, పరిమాణాన్ని మార్చుకోగల, పూర్తిగా అనుకూలీకరించదగిన ఇంటర్‌ఫేస్ దీనిని వేగవంతంగా, సరళంగా, యూజర్-ఫ్రెండ్లీగా చేస్తుంది.

# ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

**- అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు**



**హైదరాబాదం, మార్చి 25( వెలుతురు):**

ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ తన మానిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులుగా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్‌ను కూడా బంద్ చేశారని విమర్శించారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు 20 శాతం తగ్గాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్‌ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో చెప్పాలని నిలదీశారు.

# పిల్లలపై మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియా ప్రభావం

*"అతి అన్నది అమృతాన్ని కూడా విషంగా మార్చుతుంది" అనే సామెత మనకు చాలా ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. ఈ ఆధునిక ప్రపంచంలో మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియా మన రోజువారీ జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. పిల్లలు కూడా ఇప్పుడు చదువు, ఆటలు, వీడియోలు చూడడం మరియు స్నేహితులతో మాట్లాడడం కోసం స్మార్ట్‌ఫోన్లను ఉపయోగిస్తున్నారు.ఐసాంకేతికతకు అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించడం వల్ల పిల్లలకు అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందని మనందరికీ తెలిసిందే.*

"సాంకేతికత మనకు సేవ చేయాలి, మనం దానికి బానిసలు కావద్దు" అనే మాట నిజమే. మొబైల్ ఫోన్ వల్ల పిల్లలు కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే అవకాశం పొందుతున్నారు. వారు ఆన్‌లైన్ తరగతుల ద్వారా చదువు నేర్చుకోవడం, తెలియని సమాచారాన్ని సులభంగా అందుకోవడం చేస్తున్నారు. విద్యా వీడియోలు మరియు లెర్నింగ్ యాప్‌లు చదువును మరింత ఆసక్తికరంగా మరియు సులభంగా మారుస్తాయి. దీనివల్ల పిల్లలకు చాలా విషయాలు సులభంగా అర్థం అవుతున్నాయి.

ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులు అందుబాటులో ఉన్నా లేకపోయినా, పిల్లలు స్వయంగా చదువుకోగలుగుతున్నారు. ఇవన్నీ మనం కాదనలేని విషయాలు. ఇప్పుడున్న జనరేషన్ పిల్లలకు ఇది ఒక వరం అని చెప్పొచ్చు. కానీ మరోవైపు అదే శాపంగా కూడా మారుతోంది.



మొబైల్ ఫోన్లను ఎక్కువ సమయం ఉపయోగించడం వల్ల పిల్లల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఎక్కువసేపు స్క్రీన్ ముందు గడపడం వల్ల కళ్ల సమస్యలు, నిద్రలేమి, దృష్టి లోపం మరియు శారీరక వ్యాయామం తగ్గడం వంటి సమస్యలు వస్తున్నాయి. పిల్లలు గేమ్స్ మరియు సోషల్ మీడియాకు అలవాటు పడిపోతున్నారు.

చిన్న వయసులోనే వారికి అనేక విషయాలు తెలుస్తున్నాయి అని సంతోషపడాలా, లేక అవసరం లేని విషయాలు తెలుసుకుంటున్నారని బాధపడాలా అనే సందిగ్ధ పరిస్థితి తల్లిదండ్రులది. కొన్ని కుటుంబాలలో తల్లిదండ్రుల కంటే పిల్లలు సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా కలిగి ఉండటం వల్ల, వారు ఏమి చేస్తున్నారో తల్లిదండ్రులకు తెలియని పరిస్థితి ఏర్పడుతోంది.

చిన్న వయసులో ప్రేమ అనే ఆకర్షణలో పడి, ఎంతో మంది పిల్లలు మోసపోయి ఆత్మహత్యలు మరియు హత్యలకు గురవుతున్న సంఘటనలు రోజూ కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో రీల్స్ చూస్తుంటే సమాజం ఎటు దిశగా వెళ్తుందో అనే ఆందోళన సామాజిక బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరికీ కలగడం సహజం.

పెద్దవాళ్లు కూడా రీల్స్ మోజులో పడి సమయం వృథా చేస్తున్నప్పుడు, పిల్లలకు ఎలా మార్గనిర్దేశం చేయాలి అనే ప్రశ్న తల్లిదండ్రుల ముందు నిలుస్తోంది. ఇది వారి చదువుపై మరియు ప్రవర్తనపై స్పష్టమైన ప్రభావం చూపుతోంది. టీనేజ్ పిల్లలు ఉన్న తల్లిదండ్రుల మానసిక స్థితి ఇక చెప్పలేనంత ఆందోళనతో ఉంటుంది. గట్టిగా చెప్పలేరు, చెప్పకుండా ఉండలేరు.


అసలు రేపటి తరం భవిష్యత్తు ఏమిటి అని ఆలోచించవలసిన పరిస్థితిలో పెద్దలు ఉన్నారు. అలా అని అందరూ చెడిపోతున్నారు అని కాదు. చిన్న వయసులోనే ఎంతో సాధిస్తున్న కొంతమంది యువతను చూస్తుంటే గర్వంగా కూడా ఉంటుంది.

"పిల్లలు దేశానికి భవిష్యత్తు" కాబట్టి వారి ఆరోగ్యం మరియు అభివృద్ధి మనందరి బాధ్యత. పిల్లలు మొబైల్ ఫోన్లను సరైన విధంగా ఉపయోగించడానికి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషించాలి. సమయ పరిమితులు పెట్టడం, బయట ఆటలు ఆడేందుకు ప్రోత్సహించడం మరియు వారి ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించడం ద్వారా పిల్లలు కొంతవరకు ఆరోగ్యకరంగా మొబైల్ ఫోన్లను ఉపయోగించగలరు.

"సమయాన్ని సరిగ్గా ఉపయోగిస్తే విజయం ఖాయం" అనే మాటను గుర్తుంచుకోవాలి. మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియా సరైన విధంగా ఉపయోగిస్తే ఉపయోగకరమైన సాధనాలు. పిల్లలు చదువు, ఆటలు మరియు కుటుంబంతో గడిపే సమయానికి సమతుల్యతను పాటించడం నేర్చుకోవాలి. బాధ్యతతో సాంకేతికతను ఉపయోగించడం ద్వారా వారు ఆరోగ్యంగా మరియు విజయవంతంగా ఎదగగలరు.

చివరగా ఒక మాట

మనది ఉరుకుల పరుగుల జీవితమే నేను కాదనను. కానీ ఆ జీవితంలో నుండి పిల్లలకు కొంత సమయాన్ని కేటాయించి వాళ్లతో గడుపుదాం. ఇది చాలా ముఖ్యమైన విషయం. అందరూ తల్లిదండ్రులు ఆచరించాలి. మన రేపటి తరం మొబైల్‌లో బందీ కాకుండా ఆరోగ్యంగా, హాయిగా ఉండాలని, అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



**జి. రజని రెడ్డి**
నవల రచయిత

# కేరళ రాష్ట్రంలో ఎన్నికలను పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

**- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏ. ప్రసన్న కుమార్ శర్మ**

**హైదరాబాద్ వెలుతురు మార్చి 25:**

కెరళ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించకుండా ఉండటానికి భారతీయ జనతా పార్టీ మరియు ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏ. ప్రసన్న కుమార్ శర్మ ఆరోపించారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన, ఎలెక్షన్ కమిషన్ తన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించకుండా కేంద్ర ప్రభుత్వానికి తలవొగ్గి పనిచేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని, చాలా దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు ఎన్నికల కమిషన్ అంటేనే బీజేపీ, బీజేపీ అంటేనే ఎన్నికల కమిషన్ అనే భావన ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై ఎలాంటి సందేహం అవసరం లేదు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఒక లేఖపై బీజేపీ ముద్ర ఉండటం తీవ్ర వివాదానికి దారితీసింది. ఆ తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఎన్నికల కమిషన్ తప్పును అంగీకరించి, సంబంధిత అధికారిని సస్పెండ్ చేసింది. కానీ అదే ఎన్నికల కమిషన్, ఆ లేఖను సోషల్ మీడియాలో షేర్ చేసిన వారికి కేరళ పోలీసుల ద్వారా నోటీసులు పంపించింది. తప్పు



జరిగిందని అంగీకరించిన తర్వాత, ఈ నోటీసుల అవసరం ఏమిటి? ఇది కేరళలో బీజేపీ మరియు ఎల్‌డీఎఫ్ మధ్య ఉన్న సంబంధానికి స్పష్టమైన ఉదాహరణ. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బీజేపీ ముద్ర ఎలా వచ్చింది? ఎన్నికల కమిషన్ ఇప్పుడు బీజేపీ తరపున పత్రాలు జారీ చేస్తుందా? ఇలాంటి "తప్పులు" ఎందుకు ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగా మాత్రమే జరుగుతున్నాయి? ఇప్పటివరకు ఈవీఎంలలో ఎక్కడైనా లోపాలు లేదా అక్రమాలు బయటపడితే, ఎందుకు ఓట్లు ఎప్పుడూ బీజేపీకే పడుతున్నాయి? ఇలాంటి "తప్పులు" ఎందుకు కాంగ్రెస్ లేదా ఇతర ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా ఎప్పుడూ జరగవు? ఇది కేవలం ఒక ముద్ర లేదా సీల్ విషయం కాదు. ఇది మన ఎన్నికల ప్రజాస్వామ్యంపై ఉన్న నమ్మకానికి సంబంధించిన విషయం. కానీ తప్పులను సరిదిద్దడం బదులు, సమస్యలను లేవనెత్తిన వారినే వేధిస్తున్నారు. కేరళలో జరుగుతున్న ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే విధంగా, పూర్తిగా నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా నిర్వహించబడాలి. ఏ రాజకీయ పార్టీ అయినాఅందులో భారతీయ జనతా పార్టీ సహాఎన్నికల నియమావళిని అతిక్రమించే ప్రయత్నం చేస్తే, తక్షణమే కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగం, ప్రభావం చూపే చర్యలు, లేదా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగే కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావుండకూడదు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా పూర్తిగా స్వతంత్రంగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా తన విధులను నిర్వర్తించడం అత్యంత కీలకం. ప్రజల ఓటు హక్కు పవిత్రమైనది. ఆ హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడం ప్రతి రాజ్యాంగ సంస్థ బాధ్యత. కేరళ ఎన్నికలు దేశానికి ఆదర్శంగా నిలిచేలా నిర్వహించాల్సిన అవసరం ఉంది

# పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో సైబర్ హైజీన్ ప్రాక్టీసెస్ పై వర్క్‌షాప్

**- పెరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని నిపుణుల హెచ్చరిక**






**డిచ్‌పల్లి, వెలుతురు మార్చి 25, 2026:**
పత్రికా సమాచార కార్యాలయం (గ్రాxదీ), హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్‌లో సైబర్ హైజీన్ ప్రాక్టీసెస్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు, మీడియా ప్రతినిధుల్లో సురక్షిత డిజిటల్ వినియోగంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ, సైబర్ నేరాల పెరుగుదలను ఎదుర్కొనడంలో యువత, విద్యార్థులతో పాటు విద్యాసంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు సైబర్ నేరాల నివారణలో ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని అన్నారు. సైబర్ హైజీన్ అంటే కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, నెట్‌వర్క్‌లను బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో ఉపయోగించడం అని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి తోడ్పడుతున్నప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత డిజిటల్ అలవాట్లు అవలంబించాలని సూచించారు. పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డా. మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ, ఈ వర్క్‌షాప్ విద్యార్థులు, మీడియాను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన తొలి హైబ్రిడ్ కార్యక్రమమని తెలిపారు. ఈ విధానం ద్వారా సైబర్ అవగాహన విస్తృత స్థాయిలో ప్రజలకు చేరుతుందని చెప్పారు. విద్యార్థులను సైబర్ అవేర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. నిజామాబాద్ సైబర్ క్రైమ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా సైబర్ మోసాల ద్వారా సంవత్సరానికి సుమారు ₹60,000 కోట్లకు పైగా మోసాలు నమోదవుతున్నాయని, తెలంగాణలో గత సంవత్సరం సుమారు ₹1,600 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 2024లో ₹16 లక్షలు, 2025లో ₹19 లక్షలు మోసం జరిగిందని తెలిపారు. బాగా చదువుకున్న వారు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని పేర్కొంటూ, బ్యాంకు ఖాతాలను ఇతరులకు ఇవ్వకూడదని, అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయే "సైబర్ స్లేవరీ" ఘటనలపై కూడా హెచ్చరించారు.సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచేందుకు ముందుకు రావాలని, సమష్టి అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంబాబు, డైరెక్టర్ & ప్రిన్సిపాల్, యూసీఏఎస్; డా. ఎన్. స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇంగ్లీష్ విభాగం; జి. కోటేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్; శివచరణ్ రెడ్డి, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్,పీఐబీ హైదరాబాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో సురక్షిత డిజిటల్ సమాజ నిర్మాణానికి అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



# నగరంలో ఒక్క ఇంటినైనా నిర్మించారా

**- అసెంబ్లీలో తలసాని ప్రశ్న**



**హైదరాబాద్, మార్చి 25( వెలుతురు):**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా హైదరాబాద్ నగరంలో ఒక ఇంటినైనా నిర్మించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం అసెంబ్లీలె ఇందిరమ్మ ఇళ్లపై చర్చలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కార్యక్రమంతో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. 2.31 లక్షల ఇండ్లను మంజూరు చేసి 1.62 లక్షల ఇండ్లను నిర్మించామని, జంటనగరాల పరిధిలో 65 వేల ఇండ్లను లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్దిదారులకు కేటాయించామని వెల్లడించారు. సనత్ నగర్ లోని ఐడీహెచ్ కాలనీలోనే మొట్టమొదట డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాటి గవర్నర్ నరసింహన్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూసి గొప్పగా అభినందించారని గుర్తు చేశారు.జంట నగరాలలోని బస్తీలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికంగా 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంపై విమర్శలు చేస్తున్న వారు తనతో వస్తే బీఆర్ఎస్ హయాంలో ఎంత గొప్పగా నిర్మించామో చూపిస్తామని సవాల్ విసిరారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ప్రజల ఆందోళన

**- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న వివేకానంద**



**హైదరాబాద్,మార్చి 25( వెలుతురు):**
పెట్రోల్, డీజీల్, గ్యాస్ అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రజలకు సరైన భరోసా ఇవ్వడం లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టాక్స్ పెట్టుకుని ఉంటే ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండేది కాదని స్పష్టం చేశారు. యూరియా కొరతతో రైతులు ఎలా ఇబ్బంది పడ్డారో ఇన్ని రోజులు చూశాం.. ఇప్పుడు ఇంధన కొరతను చూస్తున్నామని కేపీ వివేకానంద తెలిపారు. ఇంధన నిల్వలపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకోవడం లేదని విమర్శించారు. యుద్ధం జరుగుతున్న దేశాల్లో ఇబ్బంది లేదు కానీ.. యుద్ధం లేని దేశాలు మాత్రం ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇంధన కొరతను ఊహించలేకపోవడం వల్లే ఇప్పుడు ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని అన్నారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ లేకపోతే పొద్దుగడవదని కేపీ వివేకానంద అన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఒకరిపై మరొకరు నెపం మోపుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సూచించారు.

# డీలిమిటేషన్‌తో నరగంలో సీట్లు పెరుగుతాయి

**- అది బిఆర్ఎస్‌కు లాభిస్తుందన్న సుధీర్ రెడ్డి**

**హైదరాబాద్,మార్చి25( వెలుతురు):**
డీలిమిటేషన్ జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశముందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది తమకు లాభిస్తుందని అన్నారు. నగరంలో బిఆర్ఎస్ బలంగా ఉండడం వల్ల రానున్న ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. టీడీపీ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయాల్లో సాధారణమైందని సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. అలాగే, సర్ నిర్వహించడం మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడంపై కూడా ఆయన స్పందించారు. ఐదేళ్ల పాటు నగరంలో నివసించే ఓటర్లు, ఓటింగ్ రోజు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల గ్రేటర్‌లో పోలింగ్ శాతం తగ్గుతోందని ఆయన తెలిపారు.

# పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేల కేసు

**- స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు**




**హైదరాబాద్,మార్చి25( వెలుతురు):**
పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

# ఇప్పసారాపై సభలో గందరగోళం

**- బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రుల ఆగ్రహం**

**హైదరాబాద్,మార్చి 25( వెలుతురు):**

బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో గందరగోళం నెలకొంది. భాజపా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పపువ్వు సారా అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. సారా పథకానికి మాత్రం ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా.. మరేదైనా పేరు పెట్టుకోవాలని అన్నారు. దీన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. దివంగత మహిళా ప్రధానిని భాజపా ఎమ్మెల్యే అవమానించారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భాజపా నేతలు ఇందిరమ్మ మీద ఇంకా అక్కసు ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇందిరాను అవమానించడమంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీని వాజ్‌పేయూ ఉక్కు మహిళ, దుర్గామాతా అని గతంలో అన్నారని గుర్తుచేశారు. అనంతరం తన వ్యాఖ్యలపై రాకేశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఇందిరా గాంధీపై గౌరవంతోనే ఆ పేరు పెట్టవద్దని చెప్పానన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఇప్ప సారా తయారీ కేంద్రం ఉండాలని సూచించానన్నారు. ప్రతి పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడం కాంగ్రెస్ వాళ్లకు అలవాటు. ఇప్పసారా పథకానికి మాత్రం దయచేసి ఆ పేరు పెట్టవద్దని సూచించాను. నేను చేసిన సూచనలో ఎలాంటి తప్పు లేదు. ఇందిరాగాంధీ ఉక్కు మహిళ.. ఆమె అంటే నాకు ఎంతో గౌరవం. ఆమె కాంగ్రెస్ నేత మాత్రమే కాదు.. భారత మాజీ ప్రధాని కూడా అని చెప్పారు.

# బెంగాల్ కు చంద్రబాబు, తమిళనాడుకు పవన్

**న్యూఢిల్లీ, మార్చి25( వెలుతురు):**



దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది ఎన్నికల కమిషన్. పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేరుగా తలపడుతోంది అస్సాం, పశ్చిమ బెంగాల్లో.. అయితే తమిళనాడులో సైతం ఎన్డీఏ పరంగా గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. ఈ తరుణంలో తన మిత్రులను ఉపయోగించుకోవాలని చూస్తోంది. ప్రధానంగా ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లను ప్రచారానికి పిలిచినట్లు తెలుస్తోంది. ముగ్గురికి మూడు రాష్ట్రాలు ప్రచార బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. బిజెపి పెద్దలు కోరడంతో ఈ ముగ్గురు నేతలు సమ్మతించినట్లు తెలుస్తోంది.ఏపీ సీఎం చంద్రబాబును పశ్చిమ బెంగాల్లో ఎన్నికల ప్రచారానికి కేంద్ర పెద్దలు ఆహ్వానించినట్లు ప్రచారం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఏపీ సీఎం చంద్రబాబుతో గతంలో మంచి సంబంధాలు ఉండేవి. ఎన్డీఏ ను విభేదించినప్పుడు చంద్రబాబు మమతా బెనర్జీతో కలిసి రాజకీయ వేదికలు పంచుకున్నారు. అందుకే ఇప్పుడు చంద్రబాబును రంగంలోకి దించితే మమతా బెనర్జీని ఇరకాటంలో పెట్టవచ్చని కేంద్ర పెద్దల ఆలోచన. పైగా పశ్చిమ బెంగాల్లో తెలుగు ప్రజలు కూడా ఉన్నారు. వారిలో మెజారిటీ వర్గం చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థిస్తూ ఉంటుంది. అందుకే చంద్రబాబుతో ప్రచారం చేయిస్తే వర్కౌట్ అవుతుందని కేంద్ర పెద్దల ఆలోచన. కేంద్ర పెద్దలు ఆహ్వానించేసరికి చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి రావాలని కేంద్ర పెద్దలు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఆది నుంచి తమిళనాడు విషయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటారు. సనాతన ధర్మం నినాదం చేసేటప్పుడు ఎక్కువగా తమిళనాడు నుంచి అభ్యంతరాలు వచ్చాయి. వారికి అంతే ధీటుగా సమాధానాలు చెప్పారు పవన్ కళ్యాణ్. తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతం బలంగా ఉంటుంది. సనాతన ధర్మంతో పవన్ కళ్యాణ్ ప్రజల్లోకి బలంగా వెళ్తున్న తరుణంలో.. తమిళనాడు లో ఆయన అయితే తట్టుకోగలరు అన్న నిర్ణయానికి కేంద్ర పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పవన్ కళ్యాణ్ ముమ్మరంగా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.ఇంకోవైపు మంత్రి నారా లోకేష్ కు అస్సాం ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని కేంద్ర పెద్దలు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అక్కడ బిజెపి అధికారంలో ఉంది. మరోసారి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. అక్కడ యువ ఓటర్లు అధికం. వారిని ఆకట్టుకోవాలంటే లోకేష్ లాంటి యువనేత అవసరం. మొన్నటి ఎన్నికల్లో బీహార్లో నారా లోకేష్ ప్రచారం చేశారు. ఆ ప్రచారం ఫలించింది. లోకేష్ పాల్గొన్న ప్రాంతాల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించింది. అందుకే ఇప్పుడు అస్సాంలో ఎన్నికల ప్రచారం చేయాలని బిజెపి ఆహ్వానించేసరికి లోకేష్ సమ్మతించినట్లు సమాచారం. మొత్తానికైతే ముగ్గురు నేతలు ఎన్నికల ప్రచారంలో బిజీ కానున్నారు అన్నమాట.

# తెరపైకి కంటెస్టెడ్...

**నిజామాబాద్, మార్చి25( వెలుతురు):**

రాజకీయాల్లో గెలిచిన నేతలకే పదవి, పలుకుబడి, గౌరవం ఉంటాయి. పనులు చేయించేది, ప్రజల తరఫున సమావేశాల్లో ప్రశ్నించేది కూడా పదవిలో ఉన్నవారే. మెజారిటీ సీట్లు గెలిస్తే అధికారపక్షం అంటారు.. తక్కువ సీట్లు వస్తే ప్రతిపక్షంలో కూర్చుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది కామన్. కానీ కరీంనగర్‌లో ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పెత్తనం చెలాయించే వ్యూహం రూపొందిస్తున్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులతో సమానంగా 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే', 'కంటెస్టెడ్ కార్పొరేటర్' గా స్వయంగా ప్రకటించుకుంటున్నారు. ఈమేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాహనాలకు స్టిక్కర్లు పెట్టుకుంటున్నారు. విజిటింగ్ కార్డులు ఇస్తున్నారు. ఈ వింత పరిణామం స్థానిక పాలనలో గందరగోళాన్ని సృష్టిస్తుంది.కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కార్పొరేటర్ స్థానాలు గెలిచి పీఠం దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ జరిగింది. అధికార కాంగ్రెస్ పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డినా ప్రజలు కమలం వైపే మొగ్గుచూపారు. ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులను కలుపుకుని పీఠం కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు చేశారు. కానీ బీఆర్ఎస్ హ్యాండ్ ఇవ్వడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయ. ఇక ఓడిపోయిన నాయకులు పార్టీలోని నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'కంటెస్టెడ్' పేరుతో సొంతంగా లేని పదవులు సృష్టించుకుని అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది కొత్త ట్రెండ్‌గా మారింది.ఈమేరకు పెద్ద ఫ్లెక్సీలపై 'కంటెస్టెడ్' ఎమ్మెల్యే/కార్పొరేటర్' అని పేరుపెట్టి రోడ్లపై ఏర్పాటు. మానకొండూరు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొందరు కార్లపై స్టికర్లు అంటించుకుని అధికారిక స్థాయిలో తిరుగుతున్నారు. మరికొందరు కలెక్టర్లు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో విజిటింగ్ కార్డులతో హాజరవుతుఆన్నరు. స్థానిక సమస్యల సమావేశాల్లో ప్రధాన అతిథులుగా పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓడిపోయిన అభ్యర్థులు ఎక్కువగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు.కంటెస్టెడ్ ట్రెండ్‌ను గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికార దుర్వినియోగంగా పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ స్థాయిలో డిసిప్లినరీ చర్యలు, పబ్లిక్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజల్లో గందరగోళం పెరిగి, నిజ అధికారులను గుర్తించడం కష్టమవుతోంది.

# యూపిలో రెండ్రోజులు శ్రీరామనవమి సెలవులు

**- యోగి సర్కార్ ప్రకటన**

**లక్నో, మార్చి25( వెలుతురు):**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 26, 27 తేదీలను సెలవు దినాలుగా ప్రకటించింది. పండుగ సందర్భంగా ఆలయాలను సందర్శించే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మతపరమైన మనోభావాలను గౌరవిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు యోగి ఆదిత్యనాథ్ రెండ్రోజుల సెలవుదినాల నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తద్వారా రామనవమి ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పించడం జరుగుతుందని పేర్కొన్నాయి. శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. యూపీలోని ప్రధాన ఆలయాలను సందర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఏటా తరలివస్తుంటారు. అయోధ్యతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన మార్గదర్శకాలను పోలీసులు, ప్రభుత్వాధికారులు ఇప్పటికే విడుదల చేశారు. అయోధ్య, వారణాసి, మధుర సహా ఇతర ప్రధాన నగరాల్లో ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది.

# డిస్కంలకు సింగరేణి షాక్

**ఖమ్మం, మంచిర్యాల, మార్చి25( వెలుతురు):**



సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల కొత్త థర్మల్ ప్లాంట్ విద్యుత్తును తెలంగాణకు కాకుండా రాజస్థాన్‌కు విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం రాజస్థాన్ జెన్‌కోతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ డిస్కంలు చెల్లించాల్సిన రూ. 27,379 కోట్ల భారీ బకాయిలే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ పరిణామం భవిష్యత్తులో తెలంగాణకు కరెంట్ కష్టాలతో పాటు వేల కోట్ల అదనపు ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ షాక్ ఇచ్చింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ విద్యుత్తును ఇప్పుడు రాజస్థాన్‌కు విక్రయించాలని సింగరేణి నిర్ణయించింది. దశాబ్దాలుగా తెలంగాణ గనుల నుంచి బొగ్గు తీస్తూ రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి.. ఇప్పుడు తన సొంత రాష్ట్ర డిస్కంలకు కాకుండా పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్ విద్యుదుత్పత్తి సంస్థతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు సిద్ధమవ్వడం చర్చనీయాంశంగా మారింది.ప్రధానంగా ఆర్థిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రస్తుతం ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు నుంచి సరఫరా అవుతున్న విద్యుత్తుకు సంబంధించి డిస్కంలు దాదాపు రూ. 27,379 కోట్ల మేర బకాయిలు పడ్డాయి. ఈ భారీ ఆర్థిక లోటు వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండటంతో కొత్త ప్లాంటు విద్యుత్తును నగదు చెల్లింపులు సక్రమంగా చేసే ఇతర రాష్ట్రాలకు, ఓపెన్ మార్కెట్‌కు మళ్లించాలని సింగరేణి భావించినట్లు తెలిసింది. రాజస్థాన్‌కు థర్మల్ విద్యుత్ ఇచ్చి.. దానికి బదులుగా అక్కడ 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆ కరెంటును వినియోగించుకోవాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.అయితే, ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. రాష్ట్రానికి అదనపు థర్మల్ విద్యుత్ అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు నిర్మాణానికి జెన్‌కోకు అనుమతి ఇచ్చింది. పెగడపల్లిలో ఇప్పటికే ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు పక్కనే కొత్త యూనిట్ నిర్మిస్తే భూసేకరణ భారం ఉండదు కాబట్టి మెగావాట్‌కు రూ. 12 కోట్ల ఖర్చుతోనే నిర్మాణం పూర్తవుతుంది. కానీ ఈ కరెంటును రాజస్థాన్‌కు అమ్మేసి భవిష్యత్తులో తెలంగాణ కోసం మరో చోట ప్లాంటు నిర్మించాలంటే మళ్లీ వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా భారం పడటమే కాకుండా, ప్రాజెక్టు పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుంది.మరోవైపు, పర్యావరణ నిబంధనలు కఠినతరం అవుతున్న తరుణంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు అనుమతులు రావడం కష్టతరమవుతోంది. చేతిలో ఉన్న అవకాశాన్ని వేరే రాష్ట్రానికి ధారాదత్తం చేస్తే.. భవిష్యత్తులో తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి అవసరమైన చౌక విద్యుత్ లభ్యత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. సింగరేణి టెండర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ కన్సల్టెన్సీ సంస్థల కోసం ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా దుమారం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో బకాయిల సమస్యను పరిష్కరించుకుని ఈ 800 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్ర అవసరాలకే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

**- మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం**

**- పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ**

**- సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం**

**న్యూఢిల్లీ, మార్చి25( వెలుతురు):**



భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరంగా సమాధానాలిచ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్థవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్‌జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

# బస్సులు లేక ప్రజల ఇబ్బందులు

**- అధికారులకు విన్నవించినా స్పందన లేదు**


**- విశాఖలో ధర్నాకు దిగిన విద్యార్థి సంఘం**

**విశాఖపట్టణం, మార్చి25( వెలుతురు):**

విశాఖపట్నం జిల్లాలో విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ స్థాయిలో బుధవారం ఆందోళన చేపట్టారు. గత మూడు నెలలుగా విద్యార్థుల నుండి పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, రవాణా శాఖ మంత్రికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుండి ప్రారంభమై ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. వెంకటరమణ మాట్లాడుతూ ?. జిల్లాలో ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రమైందని, దీని వల్ల విద్యార్థులు గంటల తరబడి బస్ స్టాప్‌లలో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో విద్యార్థులు తరగతులకు సమయానికి చేరుకోలేక క్లాసులు మిస్ అవుతున్నారని, అలాగే ఇంటికి తిరిగి వెళ్లడంలో కూడా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే విశాఖ ప్రజలు బస్సుల కొరతతో ఇబ్బందులు పడుతుండగా సుమారు 30 ప్రభుత్వ బస్సులను గీతం ప్రైవేట్ యూనివర్సిటీకి కాంట్రాక్ట్ ఇవ్వడం అన్యాయమని పేర్కొంటూ ఆ కాంట్రాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు అజరు మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను అమలు చేయడంలో చూపుతున్న శ్రద్ధను ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి, ప్రత్యేక బస్సులు నడపాలి, నగరానికి తగిన విధంగా బస్సుల సంఖ్యను పెంచాలని, గీతం యూనివర్సిటీకి ఇచ్చిన కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జోన్ వారీగా బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ధర్నా స్థలానికి వచ్చిన ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు విద్యార్థుల డిమాండ్లపై స్పందిస్తూ జూలై 1వ తేదీ నుంచి విశాఖ జిల్లాకు అదనంగా 100 బస్సులు ఏర్పాటు చేస్తామని, గీతం యూనివర్సిటీ కాంట్రాక్ట్‌పై ఉన్నతాధికారులతో చర్చించి రద్దు చేసే చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో విద్యార్థులు తమ ధర్నాను విరమించారు.

# బలహీనమే తప్పు.. బలి కాదు!

**హైదరాబాద్, మార్చి25( వెలుతురు):**



తెలంగాణ రాజకీయంలో అందరినీ తొలుస్తున్న ఏకైక ప్రశ్న గులాబీ బాస్‌ల అరెస్టు ఎప్పుడు? . గడప దాటిన ప్రతిచోటా, ప్రతి మీడియా సమావేశంలోనూ రేవంత్ రెడ్డికి ఎదురయ్యే ఈ ప్రశ్న వెనుక ఒక ఉత్కంఠ ఉంది. దానికి కారణం గతంలో రేవంత్ పై కేసీఆర్ చేసిన రాజకీయమే. అయితే, రేవంత్ రెడ్డి చట్టం తన పని తాను చేస్తుంది అనే వ్యూహమే పాటిస్తున్నారు. దీని వెనుక ఒక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉంది. ప్రత్యర్థులను జైలు పాలు చేయడం ద్వారా తక్షణ రాజకీయ మైలేజీ పొందడం కంటే, వారిని రాజకీయంగా నిరాయుధులను చేయడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారుఅరెస్టు అనేది రెండు అంచుల కత్తి. ఒక నాయకుడిని జైలుకు పంపడం ద్వారా అతడిని ప్రజల దృష్టిలో దోషిగా నిలబెట్టాలని అనుకుంటే, అది ఒక్కోసారి అతడిని రాజకీయ బాధితుడి గా మార్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కేటీఆర్, కేసీఆర్ వంటి నేతల్ని అరెస్టు చేస్తే, అది సోషల్ మీడియా యుగంలో అనూహ్యమైన సానుభూతిని నింపుతుంది. అక్రమ కేసులు పెట్టారనే ప్రచారం జరిగితే, అది బీఆర్ఎస్‌కు సంజీవనిలా మారుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. అందుకే, ఆవేశంతో సంకెళ్లు వేయడం కంటే, ఆధారాలతో వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడమే మేలని ఆయన భావిస్తున్నారు. కాళేశ్వరం వైఫల్యాలు, ఫోన్ ట్యాపింగ్ అక్రమాలను ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడటం ద్వారా వారి నైతిక పతనాన్ని శాశ్వతం చేయడమే రేవంత్ అసలు వ్యూహం.తెలుగు నేల రాజకీయ చరిత్ర రేవంత్ రెడ్డి ముందు స్పష్టమైన పాఠాలను ఉంచింది. గతంలో జగన్మోహన్ రెడ్డి 16 నెలల జైలు జీవితం ఆయనకు ప్రజల్లో ఒక విధమైన సానుభూతిని, తద్వారా అధికారాన్ని తెచ్చిపెట్టింది. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా ప్రజల్లో వెల్లువెత్తిన మద్దతు, సానుభూతి పవనాలు రాజకీయ సమీకరణాలను మార్చేశాయి. కేసీఆర్ వంటి ప్రాంతీయ సెంటిమెంట్ ఉన్న నాయకుడిని అరెస్టు చేస్తే, అది మళ్లీ తెలంగాణ ఆత్మగౌరవం అనే సెంటిమెంట్‌ను రాజేసే అవకాశం ఉంది. తన పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం పగ తీర్చుకుంటున్నారనే ముద్ర పడకుండా, రేవంత్ రెడ్డి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.నిజానికి కేటీఆర్‌ను చట్టపరమైన చిక్కుల్లో నెట్టే అవకాశాలు వచ్చినా రేవంత్ ఆచితూచి అడుగు వేయడం వెనుక ఉన్న పక్కా పొలిటికల్ లెక్క ఇదే. జైలు గోడల మధ్య ప్రత్యర్థిని ఒక పొలిటికల్ హీరోగా మార్చడం కంటే, బయటే ఉంచి వారిపై ఉన్న ఆరోపణలను ఎండగట్టడం ద్వారా వారి విశ్వసనీయతను దెబ్బతీయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. జైలుకు వెళ్తే వచ్చే సానుభూతి కంటే, బయట ఉండి సమాధానం చెప్పుకోలేక ఇబ్బంది పడటం వల్ల కలిగే నష్టమే ప్రత్యర్థికి ఎక్కువ. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే ఆయన కేవలం ఒక దూకుడున్న నాయకుడిగానే కాకుండా, రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏ పావును కదపాలో తెలిసిన పరిణతి చెందిన నాయకుడిగా కనిపిస్తున్నారు.మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యూహం స్పష్టంగా ఉంది. ప్రత్యర్థులను జైలులో ఉంచి బలవంతులుగా మార్చడం కంటే, వారి తప్పులను ప్రజల ముందు ఉంచి బలహీనపరచడమే సరైన మార్గమని ఆయన నమ్ముతున్నారు. ఈ వేచి చూసే ధోరణి కాంగ్రెస్ కేడర్‌కు కొంత అసహనం కలిగించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని ఆయన రాజకీయ లెక్కలు చెబుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులకు సానుభూతి మైలేజీ ఇవ్వకుండా, చట్టపరమైన ప్రక్రియ ద్వారానే అంతిమ తీర్పు వచ్చేలా చూడటం రేవంత్ రెడ్డి మార్క్ పాలిటిక్స్ అనుకోవచ్చు

# జనరల్ వార్తలు

## యుద్ధం బూమ్ రాంగ్ అయిందా

**న్యూఢిల్లీ, మార్చి25( వెలుతురు):**



పశ్చిమాసియాలో అగ్గి రాజేసిన అమెరికా రాంగ్ స్టెప్ వేశామా అని ఇప్పుడు మదన పడుతోంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం 223 రోజులు అయినా కొలిక్కి రాలేదు. కానీ తాత్కలికంగా బ్రేక్ ఇచ్చారుసుదీర్ఘంగా కొనసాగుతోంది. ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో తెలియడం లేదు. మ23 రోజుల తర్వాత కూడా ఇరాన్ తన దాడులను తగ్గించడం లేదు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను టార్గెట్ చేస్తోంది. దీంతో అగ్రరాజ్యం తీవ్రంగా నష్టపోతోంది. యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు వారాల్లోనే అగ్రరాజ్యాం రూ.7,520 కోట్లు నష్టపోయినట్లు బీబీసీ, సీఎస్ఐఎస్(సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్) నివేదికలు వెల్లడించాయి. ఇటువంటి దాడులు అమెరికా రక్షణ సాంకేతికత లోపాలను, ఇరాన్ ఆయుధ శక్తిని ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం చేశాయి.ఇరాన్ దళాలు జోర్డాన్, ఇరాక్, సిరియాలో ఉన్న అమెరికా సైనిక ప్రాంతాలను లక్ష్యంగా దాడులు చేశాయి. అమెరికా ప్యాట్రియట్, థాడ్ వ్యవస్థలను అధిగమించే వేగవంతమైనహైపర్‌సోనిక్ క్షిపణులతో ఇరాన్ దాడిచేసింది. తక్కువ ఎత్తులో ప్రయాణించి రాడార్‌లను మోసం చేసే షాహెద్?136 డ్రోన్‌లతో అమెరికాకు ఎక్కువ నష్టం కలిగించింది. ఇరాన్ జరిపిన దాడుల్లో 20 విజయవంతమయ్యాయి. జోర్డాన్‌లో అల్ ? ఉదేస్‌కు సమీపంలో రాడార్ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయి.ఇరాన్ జరిపిన దాడుల్లో అమెరికాకు చెందిన థాడ్ రాడార్ ధ్వంసమైంది. దీంతో రూ.4,200 కోట్లు నష్టపోయింది. జోర్డాన్ ప్రధాన యూనిన్ నాశనమైంది. పునరుద్ధణకు రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. ఇక ఇతర రక్షణ పరికరాలు ధ్వంసం కావడంతో రూ.1,800 కోట్లు నష్టపోయింది. వాహనాలు, ఇతర ఆస్తులు దెబ్బతినడంతో మరో రూ.1,520 కోట్లు నష్టం జరిగింది.ఈ దాడులు అమెరికా రక్షణ బడ్జెట్‌ను 20% పెంచేలా చేయవచ్చు. ఇరాన్ డ్రోన్ సాంకేతికత హోతీలు, ఇతర సమూహాలకు మార్గదర్శకంగా మారింది. ప్రాంతీయ యుద్ధ స్థితిలోకి జారడానికి అవకాశం ఉంది. మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాలు మారే అవకాశం ఉంది.

## కొండెక్కిన కోడి

**నెల్లూరు, మార్చి25( వెలుతురు):**



మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తు?న్న చికెన్ ధరలు.. తాజాగా భారీ స్థాయిలో ఎగబాకుతోంది. ధరలు కొండెక్కుతున్నాయి. ఆదివారం బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ.340 వరకు ఉండగా, అదే వారం రోజుల కిందట కిలో చికెన్ ధర రూ.260 వరకు ఉంది. చికెన్ ధరలు ఒక్కసారి పెరగడంతో సామాన్యులు కష్టంగా మారిపోయింది. ముందే యుద్ధం కారణంగా ఒక్కొక్కటిగా ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు చికెన్ ధరలు పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతున్నాయి. గతంలో ఒక గుడ్డు ధర రూ.8 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.4..20 పైసల వద్ద కొనసగుతోంది. కోడిగుడ్లు ఎగుమతి ఆగిపోవడంతో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి కోడిగుడ్లు తమిళనాడుకు తీసుకెళ్లి అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గుడ్డు ధర ఆమాంతంగా పడిపోయింది.చికెన్ ధర పెరగడానికి బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్, ఇతర ఫంక్షన్ల కారణంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమని చెబుతున్నారు చికెన్ దుకాణ వ్యాపారులు. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళ్లు కూడా దొరకడం లేదట. అలాగే పౌల్ట్రీ నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేడయం కూడా మరో కారణం అంటున్నారు. కోళ్ల డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేని కారణంగా చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

## మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్



**గుంటూరు, మార్చి25( వెలుతురు):**

2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే 'రావాలి జగన్ – కావాలి జగన్' నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడిండి. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ (ఎ–ఖంఅ) టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిషోర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది.ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన 'నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను' అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరగుతాయి. 2024 ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జగన్.. మళ్లీ పీకే సలహాలు తీసుకుని సరికొత్త 'జగన్ 2.0' వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో చూడాలి.

## జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్'

విజయవాడ, **మార్చి25( వెలుతురు):**

కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు.హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు.130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే



బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్టంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది.1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి.. కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు.కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు. అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో 'కృష్ణా ప్యాలెస్' వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది.

## డ్యామేజ్ కంట్రోల్ కోసం వైసీపీ రూట్ మార్చిందా?

**విశాఖపట్టణం, మార్చి25( వెలుతురు):**

ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది.కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం..అనారోగ్యం.. కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు.పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను



బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుపున యాదవ సామాజికవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్..స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో..గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది.ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కుమొక్కు లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంగతి తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట. చెరోదారిలో వెళ్లిపోయిన తన కుమారులను కూడా దారికి తెచ్చుకుని పార్టీకో దారి చూపిస్తారనే ఆశలతోనే వైసీపీ నాగిరెడ్డికి పీఏసీ చాన్స్ ఇచ్చారని అంటున్నారు. కూటమి నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నాగిరెడ్డి గాజువాకలో వైసీపీకి పూర్వవైభవం తీసుకొస్తారో లేదో చూడాలి.

## కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం

**గుంటూరు, మార్చి25( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే.ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్?లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి



మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

### రైతులకు ఆనందం

వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తున్నారు.మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేల ధర పలుకుతోంది.సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉన్న తేజ మిర్చి క్వింటాల్ ధర ప్రస్తుతం రూ.19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

# దురంధర్ -2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.




# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

## దర్శకుడు ప్రేమ్ స్పందన

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు.



తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు. 'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'ఫీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోలీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదల కానుంది.




# ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం. అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు. 'డియర్ అన్నా కొణిదెల, ఇన్‌స్టాగ్రామ్‌లోకి నీకు సాదర స్వాగతం.. ఈ వేదిక ద్వారా నువ్వు అర్థవంతమైన మరియు స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటావని ఆశిస్తున్నాను' అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

### భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృదందం

### త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష




మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్లైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.


# హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

## రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్

రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు, గడ్డంతో ఆయన కనిపిస్తున్న లుక్స్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ఎ÷–లాన్ చేస్తున్నారు. మహేశ్ బాబుకి జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ చిత్రంలో విలన్‌గా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్న విషయం తెలిసిందే.



# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి.. హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం



టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్' అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. సోషల్ మీడియా మార్కెటింగ్ ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

**- అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు**




**న్యూఢిల్లీ, మార్చి25( వెలుతురు):**
దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీలించి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

# చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజలు

**తిరుపతి,మార్చి25( వెలుతురు):**
చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లతో కలకలం రేగింది. సోమవారం అర్ధరాత్రి కోట పడమర ప్రవేశ ద్వారం వద్ద నడిరోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి వింత ఆకృతులతో ముగ్గులు వేసి ఉన్నారు. కోటకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా నడిరోడ్డుపై పూజలు ఎలా చేశారనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గతంలో కూడా గుప్తనిధుల కోసం అనేకమంది పూజలు చేసి వుండడంతో ఈ విషయాన్ని పురావస్తుశాఖ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు.

# తేనెటీగల దాడితో పరుగులు

**- గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి**

**నంద్యాల,మార్చి25( వెలుతురు):**
శ్రీశైలం డ్యామ్ వద్ద తీవ్ర విషాదం నెలకొంది. తేనెటీగల దాడిలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. పిల్లి వీరస్వామి(52) అనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్.. శ్రీశైలం డ్యామ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగా వీరస్వామిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. విపరీతంగా కుడుతుండడంతో తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో పరుగులు తీశారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. కానిస్టేబుల్ మృతి బాధిత కుటుంబం, డిపార్ట్‌మెంట్‌లో తీరని శోకాన్ని మిగిల్చింది.

# తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిన కూతురు

**- పోలీసుల దర్యాప్తులో అంగీకిరించన నిందితురాలు**

**హైదరాబాద్,మార్చి25( వెలుతురు):**
నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది. ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజు అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్రమంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియుడు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం

**- ప్రమాదంలో ఒకరు..సహాయక చర్యల వద్ద ఇద్దరు మృతి**

**కర్నూలు,మార్చి25( వెలుతురు):**
కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. తొలుత ఘటన జరిగిన ప్రదేశంలో ఒకరు మృతి చెందగా.. అక్కడ సహాయక చర్యలు కొనసాగుతుండగా జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. నగరంలోని కృష్ణానగర్ వద్ద జాతీయ రహదారి వంతెనపై మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కుమ్మరి శేఖర్ మృతి చెందారు. ఈ క్రమంలో అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్న వారిని మరో లారీ ఢీకొట్టింది. దీంతో శరీన్‌నగర్‌కు చెందిన బండారి కన్నాతో పాటు మరో యువకుడు మృతి చెందారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. గాయాలపాలైన వారిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉగ్ర లింకుల కేసులో మరొకరి అరెస్ట్

**- హైదరాబాద్ పాతబస్తీ మహిళ విజయవాడకు తరలింపు**

**హైదరాబాద్, మార్చి 25( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల్లో ఉగ్ర లింకులు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్టు చేయగా.. తాజాగా వారిని ఉగ్రవాదం వైపు ప్రోత్సహించిన హైదరాబాద్‌కు చెందిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విచారణ నిమిత్తం ఆమెను విజయవాడకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ సూచనలతో సయిదా బేగం పనిచేస్తుంది. ఈ క్రమంలోనే విజయవాడకు చెందని సోహైల్ బెగ్, షరీఫ్, డానిష్ యువకులను తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో ఆమె కీలక పాత్ర పోషించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఐదు టవర్లుగా సెక్రటేరియట్ ఐకానికి టవర్

**- వేగంగా ఐదు టవర్ల నిర్మాణం పనులు**

**- పనులను పరిశీలించిన మంత్రి నారాయణ**



**అమరావతి, మార్చి 25( వెలుతురు):**
రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్ల డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్‌ఓడీ టవర్ –3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో 4 నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక్ష ÷నాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్ ÷నాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే.. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

**- విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటన**

**అమరావతి, మార్చి 25( వెలుతురు):**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2026 – 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచకూడదని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కీలక ప్రకటన చేసింది. 2026 – 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపు లేదని తెలిపింది. 2026 – 2027 డిస్కమ్‌ల లోడ్ 15,790 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తానని ముందుకు రావడంతో వినియోగదారులకు బిగ్ రిలీఫ్ దక్కింది. 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ ఛార్జీల విధింపు కూడా నిలిపివేసినట్లు ఏపీఈఆర్సీ తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని కోటి 13 లక్షల మంది గృహ వినియోగదారులకు టారిఫ్ పెంపు నుంచి మినహాయింపు దక్కనుంది. ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు ఊరట నిచ్చేలా యూనిట్ ధరను 12.25 రూపాయల నుంచి 9. 95 రూపాయలకు తగ్గించింది. ఈ నిర్ణయం ద్వారా 2 లక్షల మంది వాణిజ్య వినియోగదారులకు లబ్ది చేకూరనుంది. అంతేకాదు.. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచింది. రాష్ట్రంలోని 18 వేల మంది కుటీర పరిశ్రమల వినియోగదారులకు లబ్ది చేకూరనుంది.

# రాహుల్ గాంధీ వర్సెస్ నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ, మార్చి 25( వెలుతురు):**
ఆ రాహుల్ గాంధీ సమయం దొరికితే చాలు నరేంద్ర మోడీ మీద మండిపడుతుంటాడు. రాజకీయానికి.. జాతీయభావానికి తేడా ఏమిటో రాహుల్ గాంధీకి ఇంకా తెలియదు. రాహుల్ గాంధీకి చెప్పేవారు లేరా.. చెబితే వినిపించుకోడా.. ఏంటో కాంగ్రెస్ పార్టీకి దురవస్థ. రాహుల్ గాంధీ లో లోపాలే నరేంద్ర మోడీకి వరాలుగా మారుతున్నట్టున్నాయి. అందువల్లే ఏక ఛత్రాధిపత్యంగా నరేంద్ర మోడీ దేశాన్ని పాలిస్తున్నారు .మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. భారత్ పై ఏదో ఒక రూపంలో ఆ ప్రభావం పడుతుందని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే చమురు.. గ్యాస్ విషయంలో భారత్ మీద ఆ ఎఫెక్ట్ పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ మార్కెట్ గా భారత్ ఉంది. చమురు, గ్యాస్ వంటివి సరఫరా కాకపోతే దేశంలో పరిస్థితి దారుణంగా మారుతుంది. అందువల్లే నరేంద్ర మోడీ ఇక్కడ తన చాకచక్యాన్ని ప్రదర్శించారు. ఎంతో చతురతతో ప్రపంచ దేశాలను ఒప్పించారు. ఇరాన్ గ్యాస్ సరఫరా చేయడానికి ఒప్పుకుంది. అమెరికా కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా భారత్ కు ద్వారాలు తెరిచింది. ఒక నాయకుడు బలంగా ఉంటే.. ఏ దేశమైనా సరే సలాం చేస్తుంది. అందుకు మోడీ నాయకత్వం బలమైన ఉదాహరణ.భారత్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాలలో ఒకటిగా ఉంది. భారత్ వద్ద ఉన్న సైనిక బలాన్ని పరిగణలోకి తీసుకుంటే ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సైన్యం ఉన్న దేశంగా భారత్ ఉంది. ఆసియాలో చైనా, రష్యా తర్వాత సైనిక సామర్థ్యంపరంగా భారత్ మూడో స్థానంలో ఉంది. భారత్ ఎప్పుడూ కూడా ఇతర దేశాల మీద దాడి చేయలేదు. ప్రతి సందర్భంలోనూ స్నేహపూర్వకమైన వాతావరణాన్ని మాత్రమే కోరుకున్నది. అంతటి పాకిస్తాన్ ఉగ్రవాదులతో జతకట్టి.. ఘోరాలకు పాల్పడితే.. భారత్ ప్రతి సందర్భంలోనూ గట్టి బదులిచ్చింది. పాకిస్తాన్ మినహా.. ఏ దేశం మీద కూడా భారత్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దాడి చేయలేదు.ఇక ఇజ్రాయిల్ దేశంతో భారతదేశానికి బలమైన సంబంధాలు ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ సంబంధాలు మరింతగా బలపడ్డాయి. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి భారత నాయకత్వం మీద తన ఆత్మీయతను..





అనుబంధాన్ని బహిరంగంగానే వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీని తనకు ఇష్టమైన స్నేహితుడిగా అభివర్ణించారు. కేవలం ఇజ్రాయిల్ తో మాత్రమే కాకుండా భారత్ ఇరాన్ తో కూడా బలమైన సంబంధాలను కొనసాగిస్తుంది.

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ ఉభయ కుశలోపరి విధానాన్ని కొనసాగించింది. అందువల్లే ఇరాన్ ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండానే మనకు గ్యాస్.. క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది.వాస్తవానికి మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తలు కొనసాగుతున్నప్పటికీ.. రాహుల్ గాంధీ నాయకులు సరెండర్ మోడీ అని విమర్శలు చేసినప్పటికీ.. నరేంద్ర మోడీ తన స్థిరత్వాన్ని కోల్పోలేదు. ఇక్కడ రాజకీయాల కంటే దేశ సామరస్యం.. అభివృద్ధి కోసమే ఆయన కట్టుబడి ఉన్నారు. అందువల్లే ట్రంప్ ఆదేశించినప్పటికీ హర్మూజ్ జల సంధిలో భారత్ నౌకలను మోహరించలేదు. అపరమైన నావికాదళ బలమున్నప్పటికీ ట్రంప్ చెప్పినట్టు నరేంద్ర మోడీ చేయలేదు.. ఒక ప్రాంతీయ సంఘర్షణలో ప్రత్యక్ష పాత్ర పోషించడానికి సుముఖత లేదని నరేంద్ర మోడీ తన విధానాల ద్వారా స్పష్టం చేశారు.

కొంతమంది నరేంద్ర మోడీ నాయకత్వాన్ని.. భారత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.. కానీ అలాంటివారు తెలుసుకోవాల్సింది ఏంటంటే.. ప్రపంచంలో అస్థిరత ఉంది. అశాంతి కనిపిస్తోంది. ఇంకా అనేక రకాలైన సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అయితే అంతటి కల్లోల ప్రపంచంలో భారత్ ప్రశాంతంగా ఉంది. సురక్షితంగా ఉంది. శాంతియుతంగా ఉంది. ఇలా ఉంటుందని ఎవరైనా ఊహించగలరా.. మిడిల్ ఈస్ట్ దేశాల ప్రజల ఫోన్లకు అక్కడి ప్రభుత్వాల నుంచి మిస్సైల్స్ దాడులు.. డ్రోన్ దాడుల గురించి హెచ్చరికలు వస్తున్నాయి. కానీ భారత్ లో ప్రజలు మాత్రం సినిమాలు.. యూట్యూబ్.. ఇన్స్టాగ్రామ్ రీల్స్ చూస్తూ ఆనందంగా ఉంటున్నారు. దీనిని బట్టి మోడీ నాయకత్వ పటిమ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# తెలంగాణ కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులు ఔట్..

**- మంత్రివర్గంలోకి కొత్త నేతలు.. హైకమాండ్ బిగ్ ప్లాన్!**

**హైదరాబాద్, మార్చి 25( వెలుతురు):**
తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకనున్నారు. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకు రావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది.ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.అయితే మంత్రి వర్గంలో



మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిథ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించి నట్లు సమాచారంఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం.కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com